ప్రజా కలం Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

Published From Nizamabad

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

శుక్రవారం | 19-06- 2026 సంపుటి: 17, సంచిక: 76, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆



### మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి

## ప్రభుత్వం కట్టుబడి ఉంది

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- ఉర్దూ అకాడమీ గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా ముషాయిరా
- రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం
- భూముల పరిరక్షణ, కొత్త స్మశాన వాటికల స్థల సేకరణపై కలెక్టర్లకు ఉత్తర్వులు
- సమావేశానికి హాజరైన మంత్రి హజారుద్దీన్ కార్పొరేషన్ ఛైర్మన్లు

**హైదరాబాద్, జూన్ 18 (ప్రజాకలం) :** రాష్ట్రంలోని మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందుకోసం బడ్జెట్‌లో భారీగా నిధులను కేటాయించామని, వాటికి సంబంధించిన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మైనార్టీల సంక్షేమం, వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శనివారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్లు పాల్గొన్నారు.

తరువాయి 2వ పేజీలో...

### తెలంగాణా రైతాంగానికి

# తీపి కబురు

**హైదరాబాద్, జూన్ 18 (ప్రజాకలం) :** ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని జూన్ 30న ఖమ్మం జిల్లా మధిరలో నిర్వహించే భారీ రైతు సమ్మేళనం ద్వారా అధికారికంగా ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఖమ్మం జిల్లా మధిరలో బహిరంగ సభను నిర్వహించి, అదే వేదిక నుంచి తెలంగాణ వ్యాప్తంగా రైతుల బ్యాంకు ఖాతాల్లో రైతు భరోసా నిధులను నేరుగా జమ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. గురువారం రోజున డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన అనధికారిక మంత్రివర్గ సమావేశంలో వ్యవసాయం, రైతు సంక్షేమం, ఎరువుల లభ్యత, పంటల కొనుగోలు, హైదరాబాద్ మెట్రో విస్తరణ, పరిపాలనా సంస్కరణలకు సంబంధించి తీసుకున్న కీలక నిర్ణయాలను సమావేశం అనంతరం సచివాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు,దలసరి అనసూయఏసితక్క లతోకలిసి పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ

తరువాయి 2వ పేజీలో...

### జూన్ 30నుండి రైతు భరోసా చెల్లింపులు



- ఏడు సన్నరకాల వరి వంగడాలకు బోనస్ కొనసాగింపు
- మధిరలో భారీ రైతు సమ్మేళనం నిర్వహించాలని మంత్రివర్గ నిర్ణయం
- ఎరువుల కేటాయింపులు, పంటల కొనుగోళ్లపై కేంద్రంపై ఒత్తిడి
- హైదరాబాద్ మెట్రో విస్తరణకు అనుమతులు కోరనున్న రాష్ట్ర ప్రభుత్వం

# రాజ్యమేలుతున్న అవినీతి

### అక్రమ కార్యకలాపాలకు కేంద్రంగా మెట్ పల్లి




మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 18 (ప్రజాకలం) మెట్ పల్లి డివిజన్ అక్రమ కార్యకలాపాలకు కేంద్రంగా మారిందని ఆరోపణలు వినవస్తున్నాయి. ఇటీవల స్టాంపుల తయారీ, ఫోర్జరీ సంతకాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ సంచలనంగా మారిన నేపథ్యంలో ఈ ప్రాంత ప్రజలను ఎవరిని నమ్మాలో అర్థం కాని పరిస్థితిని ఇక్కడి ప్రజలు ఎదుర్కొంటున్నారు.





బాధితురాలు జగ్గల లావణ్య

- అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న అధికారులు..
- అవుట్ సోర్సింగ్ సిబ్బంది కరువైన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- మొన్న తహశీల్దార్ ఆఫీసు.. నిన్న మెట్ పల్లి మున్సిపల్




తేలికగా స్టాంపులు తయారు చేయడంతో పాటు ఫోర్జరీ సంతకాలు, ఈజీ రిజిస్ట్రేషన్ బయటకు పొక్కిన సంఘటన ఇపుడు మెట్ పల్లి డివిజన్ లో చర్చనీయాంశంగా మారింది. చిన్నచిన్న భూ సమస్యల పరిష్కారానికి కార్యాలయానికి వచ్చే ప్రజల

తరువాయి 2వ పేజీలో...

ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రక్రియ షెడ్యూల్

### విడుదల చేయండి



2

- మంత్రి పొన్నం ప్రభాకర్

## కలం కౌంటర్




### రైతు బీమా నిలిపివేశామన్న ప్రచారం

# పూర్తిగా అసత్యం

### ఈ రెండున్నరేళ్ల కాలంలోనే 66,038 రైతు కుటుంబాలకు 3301.90 కోట్ల రైతుబీమా చెల్లింపు

- ఎల్ఐసీకి చెల్లించాల్సిన మొత్తం ప్రీమియంను చెల్లించాం: మంత్రి తుమ్మల
- రైతు పక్షపాత ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నాలు మానుకోవాలి
- పథకాలను నిలిపివేసిన చరిత్ర గత ప్రభుత్వానిది.. పునరుద్ధరిస్తున్న ఘనత మాది



**హైదరాబాద్, జూన్ 18 (ప్రజాకలం) :** రైతు మరణించిన సందర్భంలో వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే రైతు బీమా పథకాన్ని ప్రభుత్వం అత్యంత బాధ్యతతో అమలు చేస్తోందన్నారు. ఎల్ఐసీకి చెల్లించాల్సిన మొత్తం వార్షిక ప్రీమియాన్ని ప్రభుత్వం ఇప్పటికే చెల్లించిందన్నారు. రైతు బీమా పథకాన్ని నిలిపివేసినట్లు బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారం పూర్తిగా అసత్యమని మంత్రి తుమ్మల అన్నారు. రైతు సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులకు ఉపయోగపడే ఏ ఒక్క పథకాన్ని నిలిపివేసిన దాఖలాలు లేవని, పథకాలను నిలిపివేసి రైతులను ఇబ్బందులకు గురిచేసిన చరిత్ర గత ప్రభుత్వానిదే అని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే వ్యవసాయ యాంత్రీకరణ, సాయిల్ హెల్త్ టెస్ట్, సబ్సిడీపై విత్తనాలు వంటి

తరువాయి 2వ పేజీలో...



### రాయదుర్గం భూముల వేలంపై

# హైకోర్టు స్టే

**హైదరాబాద్, జూన్ 18 (ప్రజాకలం) :** తెలంగాణ ప్రభుత్వానికి కోట్లు కుమ్మరించిన రాయదుర్గం భూముల వేలంపై తెలంగాణ హైకోర్టు స్టే ఇచ్చింది. 3 మూడు వారాలపాటు స్టే విధిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. 3 వారాల్లోపు కౌంటర్ దాఖాలు చేయాలని ప్రతివాదులకు హైకోర్టు ఆదేశించింది. వేలం వేసిన భూమి తమదేనంటూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. 2015లో ఐదు ఎకరాల భూమిని ఎస్బీఐకి రాయితీపై

తరువాయి 2వ పేజీలో...

### డిపెండెంట్ ఉద్యోగం కోసం

# టెన్షన్ పడవద్దు

### ఆఫీసర్ మాట కాదని ప్రశ్నిస్తే ఛార్జ్ షీట్ ఇస్తున్నారు : టీఆర్ఎస్ ఛీఫ్ కవిత

**రామగుండం, జూన్ 18 (ప్రజాకలం) :** : సింగరేణి బాయిబాటలో భాగంగా రామగుండం ఓసీపీ -3, బేస్ వర్క్ షాప్ లను సందర్శించి, కార్మికులతో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మాట్లాడారు. కవిత మాట్లాడతూ సింగరేణిలో ఇప్పటికీ బ్రిటీష్ పాలన నడుస్తోంది. కార్మికులను వేధిస్తూ వాళ్లను ఇబ్బంది పెడుతున్నారు. నేను కార్మికుల పక్షాన ఉంటే ఓ గుంటనక్క కాంట్రాక్టర్ల పక్షాన ఉంది. మా కారణంగా జరిగిన తప్పులకు క్షమాపణ చెబుతున్నా. ఆత్మపరిశీలన చేసుకొని కార్మికుల హక్కుల కోసం పోరాటం చేస్తాం. బీఆర్ఎస్ నుంచి పంపిస్తే ప్రజల కోసం పార్టీ పెట్టాను. ప్రాణప్రదమైన సింగరేణి కార్మికులను కలిసి వారి ఆశీర్వాదం కోసం వచ్చాను. మళ్లీ గెలిపిస్తే మంచి మార్పు తెస్తాం. రేవంత్ రెడ్డి చెప్పినట్లు కాదని అన్నారు. ఆఫీసర్



మాట కాదని ప్రశ్నిస్తే ఛార్జ్ షీట్ ఇస్తున్నారు. కార్మికులను ఆఫీసర్లు ఇబ్బంది పెడుతున్నారు. మేనేజ్ మెంట్ ఒత్తిడితో కార్మికుల ఆందోళనతో ఉన్నారు.

తరువాయి 2వ పేజీలో...

## తెలంగాణా రైతాంగానికి

# తీపి కబురు



మొదటి పేజీ తరువాయి...

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న బోనస్‌ను ఏడు సన్నరకాల వరి వంగడాలకు కొనసాగించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మార్కెట్ డిమాండ్, వినియోగదారుల అభిరుచులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. బోనస్ బీపీటీ-5204, ఆర్‌ఎన్‌ఆర్-15048, హెచ్‌ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్‌ఎం-1638, డబ్ల్యూజీఎల్-44, కేఎన్‌ఎం-7715 వరి వంగడాలకు మాత్రమే వర్తిస్తుందని వివరించారు. ఈ వంగడాలు రాష్ట్రంలో సాగవుతున్న సన్నబియ్యం పంటలో దాదాపు 83 శాతం వాటాను కలిగి ఉండటమే కాకుండా ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థ వెలుపల కూడా మంచి మార్కెట్ డిమాండ్ కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణకు ఎరువుల కేటాయింపుల విషయంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై మంత్రులు ఆందోళన వ్యక్తం చేశారు. నెలకు సుమారు రెండు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయిస్తామని కేంద్రం హామీ ఇచ్చినా, గత కొన్ని నెలలుగా ఆ మేరకు సరఫరా జరగలేదని తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, తెలంగాణకు ఇప్పటివరకు మరింత అధిక స్థాయిలో ఎరువుల నిల్వలు అందాల్సి ఉందన్నారు.

అలాగే రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సీఎల్)లో ఉత్పత్తి అవుతున్న యూరియాలో అధిక భాగాన్ని తెలంగాణ రైతులకు కేటాయించాలని ప్రభుత్వం డిమాండ్ చేసింది. స్థానికంగా ఉత్పత్తి అవుతున్న ఎరువులను రాష్ట్ర రైతులకు అందించడం ద్వారా రవాణా వ్యయాలు తగ్గడంతో పాటు వ్యవసాయ సీజన్‌లో ఎరువుల కొరతను నివారించవచ్చని మంత్రులు అభిప్రాయపడ్డారు.

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండటం, మధ్య మధ్యలో పొడి వాతావరణ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు తొలి వర్షాలు పడగానే విత్తనాలు వేయడానికి తొందరపడవద్దని ప్రభుత్వం సూచించింది. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి, నేలలో తగినంత తేమ ఏర్పడిన తర్వాత మాత్రమే విత్తనాలు వేయాలని కోరింది.

సాధారణంగా మొలకెత్తడానికి, పంట ప్రారంభ వృద్ధికి కనీసం 7 మిల్లీమీటర్ల చొప్పున రెండు దఫాల వర్షపాతం అవసరమవుతుందని పేర్కొంది. వర్షాలు పడగానే తొందరపడి విత్తనాలు వేస్తే, అనంతరం పొడి వాతావరణం ఏర్పడిన పక్షంలో పంట నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది. హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణకు అవసరమైన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్‌ఎఫ్‌సీ) ద్వారా ప్రతిపాదించిన రుణానికి వెంటనే ఆమోదం తెలపాలని కేంద్రాన్ని కోరనున్నట్లు చెప్పారు. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు కూడా హైదరాబాద్ ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ఈ ప్రాజెక్టుకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించడానికి, ప్రజల రవాణా అవసరాలను తీర్చడానికి మెట్రో విస్తరణ అత్యంత కీలకమని పేర్కొన్నారు.

పరిపాలనా సంస్కరణల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ క్యాబినెట్ వ్యవస్థను ప్రవేశపెడుతున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులకు ప్రత్యేక ట్యాబ్‌లను అందించినట్లు చెప్పారు. కాగిత రహిత పరిపాలనను ప్రోత్సహించడం, పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడం ఈ నిర్ణయ లక్ష్యమని వివరించారు. ఇకపై క్యాబినెట్ నోట్లు, అజెండాలు, ఇతర అధికారిక పత్రాలు ఎక్కువగా డిజిటల్ రూపంలోనే నిర్వహించబడతాయని, దీంతో కాగిత వినియోగం తగ్గడంతో పాటు నిర్ణయ ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందని తెలిపారు. రాబోయే నీట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం ప్రకటించింది.

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.95 లక్షల మంది విద్యార్థులు 2,008 కేంద్రాల్లో పరీక్ష రాయనున్నట్లు అంచనా. హాల్ టికెట్ చూపించిన విద్యార్థులకు ఉచిత ప్రయాణం కల్పించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. విద్యార్థులు, వారి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించడమే ఈ నిర్ణయ లక్ష్యమని పేర్కొంది.

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్)లో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న మార్పుల ప్రభావాన్ని అధ్యయనం చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు.

ఈ ఉపసంఘంలో మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, సీతక్క సభ్యులుగా ఉంటారని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న పరిణామాలను అధ్యయనం చేసి, తెలంగాణపై పడే ఆర్థిక భారం ఎంత ఉంటుందో అంచనా వేసి, రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై సిఫారసులు చేయనుందని తెలిపారు. కొన్ని ప్రతిపాదిత మార్పులు గ్రామీణ ఉపాధి అవకాశాలను తగ్గించే ప్రమాదం ఉండటంతో పాటు రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం మోపే అవకాశం ఉందని ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. ఉపసంఘం అన్ని వర్గాల అభిప్రాయాలను సేకరించి త్వరలోనే నివేదిక సమర్పించనుంది. ఇటీవలి యాసంగి సీజన్‌లో తెలంగాణ ప్రభుత్వం రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దాదాపు 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం దేశంలోనే ఈ సీజన్‌లో ఏ రాష్ట్రం సాధించని ఘనత అని పేర్కొన్నారు. దేశ ఆహార ధాన్య నిల్వలకు తెలంగాణ ప్రధాన సహకార రాష్ట్రంగా అవతరించిందని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులను రైతుల బ్యాంకు ఖాతాల్లో 48 గంటల వ్యవధిలోనే నేరుగా జమ చేయడం ద్వారా పారదర్శకతను, రైతుల ఆర్థిక భద్రతను ప్రభుత్వం నిర్ధారించిందన్నారు. తాజా కొనుగోలు సీజన్‌లోనే సుమారు రూ.18,000 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుత వ్యవసాయ చక్రంలో మొత్తం రూ.38,000-39,000 కోట్ల వరకు రైతులకు చెల్లింపులు జరిగాయని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాల కాలంలో కొనుగోలు కార్యకలాపాల ద్వారా రైతులకు దాదాపు రూ.1 లక్ష కోట్లకు పైగా చెల్లింపులు జరిగాయని, ఇదే సమయంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో సుమారు రూ.1.30 లక్షల కోట్లు చెల్లించబడినట్లు వివరించారు.

కేంద్ర కొనుగోలు విధానంపై ఆందోళన

తెలంగాణలో పండుతున్న పంటలను కేంద్ర సంస్థలు తగిన స్థాయిలో కొనుగోలు చేయకపోవడంపై మంత్రులు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భారీ స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయడమే కాకుండా, సుమారు 15 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కూడా కొనుగోలు చేసినప్పటికీ, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) వ్యవస్థలో కేంద్ర సంస్థలు ఆశించిన స్థాయిలో కొనుగోళ్లు చేయడం లేదని పేర్కొన్నారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా ధాన్యం, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా పత్తి, నాఫెడ్ ద్వారా ఇతర పంటలను కొనుగోలు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వం తన రాజ్యాంగ, విధానపరమైన బాధ్యతలను నిర్వర్తించాలని డిమాండ్ చేశారు.

## మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి

# ప్రభుత్వం కట్టుబడి ఉంది

మొదటి పేజీ తరువాయి...

ఉర్దూ అకాడమీ గోల్డెన్ జూబ్లీ (స్వర్ణోత్సవాల) సందర్భంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో ఉర్దూ సంస్కృతిని ప్రతిబింబించేలా పెద్ద ఎత్తున 'ముషాయిరా' (కవి సమ్మేళనాలు) నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఈ కార్యక్రమం నిర్వాహణకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను అన్ని రకాల ఆధునిక హంగులు, వసతులతో నిర్మిస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20 రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని, మరో 17 పాఠశాలలు నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు ఈ సందర్భంగా వివరించారు. దీనిపై భట్టి విక్రమార్క స్పందిస్తూ... అసంపూర్తిగా మిగిలిపోయిన మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల భవనాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పనులు ఎక్కడా ఆగకుండా ఒక నిర్ణీత టైమ్ క్యాలెండర్‌ను రూపొందించుకుని, దాని ప్రకారమే పనులు పూర్తయ్యేలా పర్యవేక్షణ చేయాలని, మిగిలిన 17 పాఠశాల భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మైనార్టీ యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు మరియు వారిని ఆర్థికంగా నిలబెట్టడానికి రాజీవ్ యువ వికాసం' పథకం ద్వారా పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలు చేయడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమం కొరకు ప్రత్యేకంగా హా రూ. 50 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నిధులను క్రిస్టియన్ మైనార్టీ యువత స్వయం ఉపాధి రంగంలో రాణించడానికి తగిన ఆర్థిక ప్రోత్సాహం అందించడానికి కేటాయిస్తామన్నారు. మైనార్టీ సంస్థలకు సంబంధించిన విలువైన వక్ఫ్ మరియు ఇతర భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు తగిన చట్టపరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే, మైనార్టీలహా స్మశాన వాటికల చుట్టూ ప్రహరీ గోడల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందుకోసం తక్షణమే ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న జిల్లా, డివిజన్ కేంద్రాల్లో స్మశాన వాటికల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను సేకరించి కేటాయించాల్సిందిగా జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు.

# డిపెండెంట్ ఉద్యోగం కోసం టెన్షన్ పడవద్దు

మొదటి పేజీ తరువాయి...

ఆఫీసర్లమో వాళ్ల హక్కుల కోసం నిన్న ధర్నా చేశారంట. అదే కార్మికులు ధర్నా చేస్తే మాత్రం మెమో లు ఇస్తున్నారు. ఇది సరికాదు. ఆఫీసర్లు, ప్రభుత్వం తీరు మారాలి. నేను టీజీబీకేఎస్ లో ఉన్నప్పుడే ప్లే డే, ఎన్ మైనస్ పద్ధతి, హీహెచ్డీ లో 50 శాతం ఇచ్చే విధానం వచ్చింది. దీని కారణంగా కార్మికులు 2 నుంచి 3 లక్షల వరకు నష్టపోతున్నారని తెలిసింది. కార్మికులకు ఇంత నష్టం జరుగుతుందని అప్పుడు మాకు తెలియదు. మా కారణంగా జరిగిన తప్పునకు కార్మికులకు క్షమాపణ చెబుతున్నానని అన్నారు. కచ్చితంగా జరిగిన తప్పులను సవరించుకుంటాం. ఆత్మ పరిశీలన చేసుకుంటాం. మళ్లీ హీహెచ్డీ పూర్తిస్తాయిలో వచ్చే హక్కును మీకు తెచ్చి పెడతానని మాట ఇస్తున్నా. అదే విధంగా మెడికల్ స్కీమ్ అందరికీ ఒకేలా వర్తించాలని కోరుతున్నా. ఒక్కొక్కరికీ ఒక్కో న్యాయం ఉండొద్దు. మెడికల్ స్కీమ్ పారదర్శకంగా అమలు చేయాలి. సింగరేణి కార్మికుల నుంచి రిఫరల్ హాస్పిటల్స్ డబ్బులు వసూలు చేయకుండా చూడాలి. ఒకప్పుడు సింగరేణి కార్మికుల కోసం మంచి స్కూల్స్ ఉండేవి. కానీ ఇప్పుడు స్టాఫ్ లేదే. కొన్నేళ్లుగా ప్రభుత్వాల విధానాల కారణంగా ఈ పరిస్థితి వచ్చింది. సింగరేణి కార్మికులు కూడా విద్య, వైద్యం కోసం భారీగా ఖర్చు చేసే పరిస్థితి తెచ్చారు. ఇక అలియాస్ పేర్లకు సంబంధించి చాలా ఇబ్బంది పెడుతూ విజిలెన్స్ కేసులు పెడుతున్నారు. గతంలో మేము అలియాస్ పేర్ల విషయంలో చూసి చూడనట్లు వ్యవహరించాలని యాజమాన్యానికి చెప్పి ఎంతో మందికి మేలు చేశాం. కానీ ఉద్యోగాలు ఇవ్వవద్దన్న కారణంతో అలియాస్ పేర్ల విషయంలో విజిలెన్స్ కేసులు పెడుతున్నారు. టెన్త్ పాస్ అంటూ కొర్రీలు పెడుతున్నారు. సింగరేణి కార్మికులకు చదువు ప్రామాణికం కాదు. కానీ ఉద్యోగాలు ఇవ్వొద్దన్న కారణంతో ఇవన్నీ చేస్తున్నారు. డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. ఇప్పటి వరకు కూడా 2 వేల మందికి ఇంకా ఉద్యోగాలు ఇవ్వకుండా పెండింగ్ లో ఉంచారు. నాలుగు నెల క్రితం మేము హైదరాబాద్ లో సింగరేణి భవన్ ను ముట్టడిస్తే మెడికల్ బోర్డు పెట్టారు. కానీ దాని వల్ల కూడా ఎవరికీ ప్రయోజనం లేకుండా పోయింది. కచ్చితంగా నెలకు రెండుసార్లు సింగరేణి మెడికల్ బోర్డును నిర్వహించాలి. నాలుగైదు నెలల్లో రిటైర్‌మెంట్ అవుతున్న వాళ్లు డిపెండెంట్ ఉద్యోగం కోసం టెన్షన్ పడవద్దు. హెచ్‌ఎంఎస్ గెలిచిన వెంటనే మీ అప్లికేషన్ డేట్ ను ప్రామాణికం చేసేలా చేస్తాం. సింగరేణిలో ఓపెన్ కాస్ట్, అండర్ గ్రౌండ్ మైనింగ్ రెండు ఉండాలనే పాలసీ మాకు ఉంది. ఇక్కడ ఓసీ-3 మన సంస్థ ఆధ్వర్యంలో నడవటం కారణంగానే ఇక్కడ ఎక్కువ మంది పర్మినెంట్ ఎంప్లాయిస్ ఉన్నారు. అదే ప్రైవేట్ వాళ్లు నిర్వహించే మైనింగ్ లో ఎక్కువ మంది కాంట్రాక్ట్ కార్మికులే ఉంటారు. ఫ్యూచర్ లో ఓపెన్ కాస్ట్ గనులను కూడా సింగరేణియే నిర్వహించాలని మేము డిమాండ్ చేస్తున్నాం. నిన్నటి వరకు అండర్ గ్రౌండ్ మైనింగ్ కార్మికులను కలిశాం. ఇప్పుడు ఓపెన్ కాస్ట్ కార్మికులను కలుస్తున్నాం. వాళ్ల బాధలు వాళ్లకుంటే మీ బాధలు మీకు ఉన్నాయి. ముఖ్యంగా ఈపీ ఆపరేటర్లకు చాలా ఇబ్బం దులు ఉన్నాయి.

# రైతు బీమా నిలిపివేశామన్న ప్రచారం పూర్తిగా అసత్యం

మొదటి పేజీ తరువాయి...

పథకాలను నిలిపివేయడమే కాకుండా స్టేట్ వాటాను విడుదల చేయకుండా కేంద్ర ప్రాయోజిత పథకాలను సైతం రైతులకు దూరం చేసిందని విమర్శించారు. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎలాంటి బేషజాలకు పోకుండా అమలు చేయడమే కాకుండా.. గత ప్రభుత్వం ఆపేసిన పథకాలను పునరుద్ధరిస్తూ రైతులకు అండగా నిలుస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదే అని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 66,038 మంది రైతుల కుటుంబాలు రైతు బీమా పథకం ద్వారా లబ్ధి పొందాయని మంత్రి తెలిపారు.

ఆయా కుటుంబాల నామినీల ఖాతాల్లో మొత్తం రూ. 3301.90 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. 2023 డిసెంబర్ నుంచి ఆ ఏడాది ముగిసే వరకు 20,090 కుటుంబాలకు రూ.1,004.50 కోట్లు, 2024 సంవత్సరంలో 25,861 కుటుంబాలకు రూ.1,293.05 కోట్లు బీమా సాయంగా అందించినట్లు వివరించారు.

2025-26 సంవత్సరానికి రాష్ట్రంలో 42.16 లక్షల మంది రైతులు రైతు బీమా పథకంలో నమోదు చేసుకున్నారని, వీరందరికీ వర్తించేలా ఎల్‌ఐసీకి చెల్లించాల్సిన మొత్తం వార్షిక ప్రీమియం రూ.1,359.56 కోట్లను ప్రభుత్వం పూర్తిగా చెల్లించిందన్నారు. దీంతో 20,087 కుటుంబాలకు రూ.1004.35 కోట్లు బీమా సహాయంగా అంది, మరణించిన రైతు కుంటుబాలకు ఆర్థిక చేయూత అందించడం జరిగిందని అన్నారు.

రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నాలు మానుకోవాలని మంత్రి హితవు పలికారు. రైతు మరణంతో దుఃఖంలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి వారిని ఆర్థికంగా నిలదొక్క కొనే విధంగా రైతు బీమా పథకాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

## రాయదుర్గం భూముల వేలంపై

# హైకోర్టు స్టే

మొదటి పేజీ తరువాయి...

టీజీఐఐసీ కేటాయించింది. ఇన్నోవేషన్, డేటాసెంటర్ నిర్మాణం కోసం ఎస్బీఐకి కేటాయించింది. టీజీఐఐసీ ఎస్ బీఐకి చెందిన భూమిని ఇటీవలే వేలం వేసింది. వేలంలో ఎకరా భూమి ధర రూ, 237 కోట్లు పలికింది. వేలం రద్దు చేసి భూమిని తమకే కేటాయించాలని ఎస్బీఐ హైకోర్టులో పిటిషన్ వేసింది. 2010లో టీజీఐఐసీతో ఎస్బీఐ ఒప్పందం కుదుర్చుకుందని ఏఏజీ తెలిపారు. రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేసేలా ఎస్బీఐ ఒప్పందం కుదుర్చుకుందని కోర్టుకు ఏఏజీ వివరించారు. 16 ఏళ్లు అయినా నిర్మాణమే ప్రారంభం కాలేదని అదనపు అడ్వకేట్ జనరల్ పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం భూమిపై పూర్తి హక్కు టీజీఐఐసీకే చెందుతోందని ఏఏజీ స్పష్టం చేసింది. భూమిని ఏ కారణంతో వేలం వేశారు? స్థిరాస్థి వ్యాపారాన్ని పరుగులు పెట్టించాలనుకున్నారా? అని న్యాయమూర్తి ఏఏజీని ప్రశ్నించారు. భూమి వేలం వేసి ఆ డబ్బులను ప్రజాశ్రేయస్సు కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తుందని ఏఏజీ న్యాయమూర్తికి సూచించారు. మరోచోట భూమి తీసుకునేందుకు ఎస్బీఐ అంగీకరించిందని న్యాయవాది నిరంజన్ రెడ్డి తెలిపారు. ఎస్బీఐ అధికారులు చందనవల్లి భూమిని పరిశీలించారని నిరంజన్ రెడ్డి చెప్పారు. ఇప్పుడు మాటమారుస్తూ భూమి తమకే ఇవ్వాలంటూ కోర్టుకెక్కారని నిరంజన్ వివరించారు. కౌంటర్ దాఖలు చేసే వరకు మధ్యంతరం ఉత్తర్వులు ఇవ్వొద్దని నిరంజన్ రెడ్డి ధర్మాసనాన్ని కోరారు. డబ్బులు కట్టించుకున్న తర్వాత ఆ భూమి ఎస్బీఐకే చెందుతుంది కదా? అని న్యాయమూర్తి వెల్లడించారు. రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేయనందున భూమి టీజీఐఐసీకే చెందుతోందని అదనపు ఏజీ పేర్కొన్నారు.

## ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రక్రియ

# షెడ్యూల్ విడుదల చేయండి

**- బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



హైదరాబాద్ : ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడి 30 నెలలు పూర్తయిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ టీజీఎస్‌ఆర్టీసీ పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై సచివాలయంలో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. 2023-26 మధ్యకాలంలో ప్రజా పాలన ప్రభుత్వం రూ.1,078 కోట్ల వ్యయంతో 2,815 నూతన బస్సులను కొనుగోలు చేసిందని తెలిపారు. అలాగే ఏటూరు నాగారం, పెద్దపల్లి ప్రాంతాల్లో రెండు కొత్త డిపోలను మంజూరు చేసినట్లు వెల్లడించారు. తార్నాక ఆర్టీసీ ఆసుపత్రిని ప్రాథమిక వైద్య సేవల స్థాయి నుంచి సూపర్ స్పెషాలిటీ సేవలు అందించే ఆసుపత్రిగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. బ్రెడ్ విన్నర్ స్కీమ్, మెడికల్ ఇన్వాలిడేషన్ కింద మొత్తం 1,137 కారుణ్య నియామకాలు చేపట్టినట్లు చెప్పారు. వీరిలో 888 మంది కండక్టర్లు, 10 మంది డ్రైవర్లు, 43 మంది శ్రామిక్‌లు, 196 మంది కానిస్టేబుళ్లు ఉన్నారని వివరించారు. ఆర్టీసీ ఆర్థిక పరిస్థితి మెరుగుదలకు ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల సీఎస్ఎస్ బకాయిలు రూ.1,096.90 కోట్ల నుంచి రూ.862 కోట్లకు తగ్గాయని, పీఎఫ్ బకాయిలు రూ.2,018.15 కోట్ల నుంచి రూ.1,714.39 కోట్లకు తగ్గాయని తెలిపారు. అలాగే ఎస్ఆర్బీఎస్, ఎస్బీటీ బకాయిలను కూడా రూ.493.02 కోట్ల మేర తగ్గించినట్లు పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్హులైన కారుణ్య నియామకాలను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వీసు నుంచి తొలగించబడిన 490 మంది ఉద్యోగుల్లో ఇప్పటికే 244 మందిని విధుల్లోకి తీసుకున్నామని, మిగిలిన కేసులను త్వరితగతిన పరిశీలించాలని సూచించారు. మహాలక్ష్మి పథకం మహిళల ఆర్థిక సాధికారతపై చూపుతున్న ప్రభావాన్ని అధ్యయనం చేసి ఫీడ్‌బ్యాక్ నమోదు చేయాలని ఆదేశించారు. మహిళా సంఘాలను 553 బస్సులకు యజమానులుగా చేసి ఆర్టీసీకి అద్దె ప్రాతిపదికన అందిస్తున్న నేపథ్యంలో వారి అభిప్రాయాలను కూడా సేకరించాలని సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,050 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని, అవి ఏ రూట్లలో నడుస్తున్నాయి, లాభదాయక రూట్లు ఏవి, నష్టాలు వస్తున్న మార్గాలు ఏవి అనే అంశాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఈడి లు, ఇతర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాజ్యమేలుతున్న అవినీతి



– ఫైల్ ఫోటో

మొదటి పేజీ తరువాయి...

నుండి సమస్యను బట్టి ఒక రేటు ఫిక్స్ చేసి మున్సిపల్, రెవెన్యూ అధికారులు సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఇక్కడ బహిరంగంగానే చర్చ జరుగుతోంది. స్టాంపులు తయారీ నుంచి మొదలుకొని రిజిస్ట్రేషన్ల వరకు ప్రొఫెషనల్ తరహాలో తయారు చేయడం అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ముఖ్యంగా భూ సంబంధ ఆర్థిక లావాదేవీల్లో ఎలాంటి భద్రత నిర్ణయాలను తీసుకోవాలో అర్థం కాని పరిస్థితి కనిపిస్తోంది. గతంలో మున్సిపాలిటీకి సంబంధించిన స్టాంపులను కూడా తయారు చేసి వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడుకోవడంతో బట్టబయలైంది తెలిసిందే. మున్సిపల్ కార్యాలయంలో పని చేసే ఉద్యోగినే స్టాంపులు తాయారు చేయడంతో అతన్ని విధుల్లో నుంచి తీసేశారు. అయితే స్టాంపులు తయారీకి సంబంధిత కార్యాలయం ఆఫీసర్ స్టాంపుల ఆర్డర్ కు అవసరమైన లేఖ రాయాల్సి ఉంటుంది. కానీ ఆఫీసర్ ఎలాంటి లేఖ రాయకుండా స్టాంపులు తయారు చేయడం, దాన్ని అక్రమాలకు వినియోగించే వ్యక్తులకు అందించడం రబ్బర్ స్టాంపులు తయారీదారులకు భయం లేకపోవడం అందరిని ఆందోళనకు గురి చేస్తుంది. అయితే ఇందులో ఎంతో ప్రావీణ్యం ఉన్న వ్యక్తులే వీటిని ఆర్డర్ ఇవ్వడం, తయారు చేసి ఇవ్వడం వెనుక పెద్ద ఎత్తున మోసాలకు తెరలేపినట్లు అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. ముఖ్యంగా ఆఫీసర్ సంతకాన్ని ఫోర్జరీ చేయడం అందరికీ సాధ్యం కాదు.. ప్రొఫెషనల్ తరహాలో ఈ సంతకాలను ఫోర్జరీ చేసినట్లు తెలుస్తోంది. ఎన్నో లోపాలతో ఉన్న భూ వ్యవహారాల్లో పెద్ద ఎత్తున ఆర్థిక వ్యవహారాలను కొనసాగుతాయని రబ్బర్ రబ్బర్ స్టాంపుల తయారీ పై ఆరోపణలు వినవస్తున్నాయి. దీనికి తోడు భూములకు సంబంధించిన సరైన పత్రాలు వారి వారసుల దగ్గర లేకపోవడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు స్వయంగా వాటికి సంబంధించిన పనులను పూర్తి చేసి భూ యజమాని దగ్గర పత్రాల తయారీకి సంబంధించిన ఫీజును వేరుగా వసూలు చేసి ఫేక్ డాక్యుమెంట్లు తయారు చేసి విక్రయిస్తూ కొందరు బడా బాబులె అక్రమ వ్యాపారులతో సొమ్ము చేసుకుంటున్నారని కోట్లకు పడగలెత్తున్నారని స్థానికంగా చర్చ జరుగుతోంది. రబ్బర్ స్టాంపులు ఫోర్జరీ సంతకాలు కేసుల్లో క్రిమినల్ కేసులు, జైలు జీవితం వంటి వాటి పట్ల ఎవరినైనా భయాందోళనకు గురి చేస్తుంది. కానీ ఎలాంటి భయం లేకుండా స్టాంపులు తయారికి ఆర్డర్, తయారు చేయడం, ఇవ్వడంతో పాటు ఫోర్జరీ సంతకాల నేపథ్యంలో ఏర్పడిన పరిస్థితులను బట్టి వీటికి ప్రొఫెషనల్స్ కూడా పెద్ద మొత్తంలోనే డబ్బులు తీసుకుంటారని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అంతేకాకుండా ఒక ఆఫీసర్ సంతకాన్ని ఫోర్జరీ చేయాలన్న ఎన్నో ఇబ్బందులు ఉంటాయని తెలిసినప్పటికీ సంతకాలను కూడా ఫోర్జరీ చేయడం వంటి నేరాల్లో చట్టాలపై భయం లేకపోవడం వంటి కార్యక్రమాలను పరిశీలిస్తే ఈ ప్రాంతంలో చాలా కాలం నుండి అక్రమాల గుట్టు కొనసాగుతోందని వినవస్తోంది. అంతగా అధికారుల పర్యవేక్షణ ఉండదని భావించిన ల్యాండ్ మాఫియా నేరగాళ్లు ఇలాంటి వ్యవహారాలను నడుపుతున్నట్లు ఇక్కడ ప్రచారం జరుగుతుంది. ఏమైనాప్పటికీ ఉన్నతాధికారులు రబ్బర్ స్టాంపులు, ఫోర్జరీ సంతకాలు తదితర అంశాలపై లోతుగా విచారణ జరిపి తెర వెనక కథ నడిపే బడా బాబుల ల్యాండ్ మాఫియా ముఠాను పట్టుకొని అక్రమ కార్యకలాపాలకు తావు లేకుండా ప్రతి వ్యవహారం పారదర్శకంగా జరిగేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



రుద్రంగి, జూన్ 18, (ప్రజాకలం ప్రతినిధి) :

విద్యార్థుల్లో విద్యాపట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం గ్రామ సర్పంచ్ బుర్ర శంకర్, ఉప సర్పంచ్ దాసరి అశోక్ తో పాటు గ్రామ ప్రజాప్రతినిధులు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందచేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బుర్ర శంకర్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్‌కు పునాది ప్రభుత్వ పాఠశాలలేనని, వారి అభివృద్ధికి గ్రామపంచాయతీ సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. ఉప సర్పంచ్ దాసరి అశోక్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజాప్రతినిధులు కూడా విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతి, వార్డు సభ్యులు లక్కాకుల రమేష్, మాజీ వైస్ ఎంపీపీ లు పిసరి భూమయ్య, బాధనవేని రాజారాం, విడిసి చైర్మన్ అంగరకుల మహేష్,నాయిని రాజేశం, చెదలు నవీన్, లక్కాకుల స్వామి, జక్కు గంగాధర్, తాటికొండ శ్రీనివాస్, బత్తుల వెంకట్ గ్రామస్థులు పాల్గొన్నారు.

## అవగాహన సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

**- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్.**




మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 18 (ప్రజా కలం) ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు సంబంధించిన నిర్వహించే అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తెలిపారు. కోరుట్ల అరుణోదయ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బజాజ్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో ఎంపికైన విద్యార్థులకు అపాయింట్‌మెంట్ లెటర్లు ను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అందచేశారు. కోరుట్ల పట్టణంలోని అరుణోదయ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు బజాజ్ ఫైనాన్స్ సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ నైపుణ్యాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగానికి సంబంధించిన అంశాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసం, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ శిక్షణ అనంతరం బజాజ్ ఫైనాన్స్‌లో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు అపాయింట్‌మెంట్ లెటర్లను ఏమ్మెల్యే సంజయ్ అందజేశారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ వారి భవిష్యత్ ఉజ్వలంగా ఉండాలని ఏమ్మెల్యే సంజయ్ కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, కరెస్పాండంట్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**




నిర్మల్ ,జూన్ 18(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): బాసరలో జరగనున్న గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం బాసర పుష్కరాల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వచ్చే సంవత్సరంలో నిర్వహించే గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా పాత పుష్కర ఘాట్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు, అవసరమైన చోట కొత్త ఘాట్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పుష్కర ఘాట్లను భక్తులకు కనువిందుగా ఉండేలా సుందరీకరించాలని, కళ్యాణ కట్ట, పిండ ప్రదాన వేదికలు, దుస్తులు మార్చుకునే గదులను తక్షణమే నిర్మించాలని సూచించారు. చేపట్టే ప్రతి నిర్మాణ పనిలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ఘాట్ల సమీపంలో భక్తులకు తాగునీటికొరత లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అలాగే, ఆయా శాఖల అధికారులు తమకు కేటాయించిన పనులకు సంబంధించిన పూర్తి స్థాయి ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ మాస్టర్ ప్లాన్‌పై కూడా చర్చించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, బాసర ఆలయ ఈవో అంజనా దేవి, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులలకు టాస్కా ఆసరా

**- కోరుట్ల డివిజన్ టాస్క ఆధ్వర్యంలో వయోవృద్ధుల వేధింపుల నిరోధక అవగాహన సదస్సు**



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 18:(ప్రజా కలం) వృద్ధులకు తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ ఆసరా ఉందని సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ అన్నారు. ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ కోరుట్ల డివిజన్ శాఖ ఆధ్వర్యంలో 15 వ ప్రపంచ వృద్ధుల వేధింపుల నిరోధక అవగాహన దినోత్సవంను అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 24 మంది సీనియర్ సిటిజెన్లను టాస్కా రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ చేతుల మీదుగా అసోసియేషన్ మెమంటోలు, చట్టం పిలుపు పుస్తకాలను అందించి పట్టు శాలువాలతో సన్మానించారు. అనంతరం హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లాలో జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, మెట్ పల్లి ఆర్డీ వో నర్సింహా రావులు వృద్ధుల కేసుల పరిష్కారం లో తమ అసోసియేషన్ సహకారం తో రాష్ట్రములో నెంబర్ వన్ గా నిలిచారన్నారు. తల్లి దండ్రులైన వృద్ధులను నిరాధరణకు, వేధింపులకు గురించేస్తే వారి కొడుకులు, కూతుర్లు, వారసులకు 6 మాసాల జైలు శిక్ష తో పాటు జరిమానా ఆర్డీవో విధిస్తారని, మాయ మాటల్తో, మోసం తో ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకొని పోషించక పోతే తిరిగి అట్టి ఆస్తులను తల్లి దండ్రుల పే రిట మార్చే అధికారం తో పాటు ప్రభుత్వ ఉద్యోగులయి న వారు తమ తల్లి దండ్రుల ను నిరాధరణకు గురి చేస్తే వారి వేతనం లో నుంచి ప్రతి నెల 15 శాతం లేదా, రూ.10 వేలు కట్ చేయించి వారి తల్లి దండ్రుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయించే అధికారం కలెక్టర్ కు ఉందని చట్టాల్లోని అంశాలను వివరించారు. ప్రభుత్వ ఉద్యోగుల తల్లి దండ్రుల పోషణ చట్టాన్ని అమలులోకి తెచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ కృష్ణారెడ్డి,సీనియర్ సిటిజెన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. సి. హన్మంత్ రెడ్డి,జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాతం, ఉపాధ్యక్షులు బొల్లం విజయ్, ఎం ఎం. డి. యాకూబ్,కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు, కోరుట్ల డివిజన్ అధ్యక్షులు పబ్బా శివానందం, వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక గంగారాం, ఉపాధ్యక్షులు ఎం. డి. సైఫోద్దీన్, గుంటుక సాంబ మూర్తి, కోశాధికారి ఏన్. లక్ష్మి నారాయణ, ఏ. వెంకటేశ్వర్ రావు, అశోక్, ప్రకాశ్, కోరుట్ల, కథలాపూర్, మేడి పల్లి మండలాల సీనియర్ సిటిజెన్స్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

**- మండల వైద్యాధికారి డాక్టర్. ఎల్లాల అంజిత్ రెడ్డి**

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 18 (ప్రజాకలం) సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం అని మండల వైద్యాధికారి డాక్టర్. ఎల్లాల అంజిత్ రెడ్డి వెల్లడించారు. మెట్‌పల్లి మండలంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వెక్టర్ జనిత వ్యాధుల నివారణ, నియంత్రణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి మండల వైద్యాధికారి డాక్టర్. అల్లాల అంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ ప్రదీప్, సబ్ యూనిట్ అధికారి విలాయత్ బేగ్, హెల్త్ ఎడ్యుకేటర్ రమేశ్, పం చాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.సమావేశంలో గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో దోమల పెరుగుదలకు అనుకూలంగా ఉన్న నిల్వ నీటి వనరులను గుర్తించి వెంటనే తొలగించాలని సూచించారు. ప్రతి శుక్రవారం “డ్రై డే” కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అంజిత్ రెడ్డి మాట్లాడుతూ, డెంగ్యూ నివారణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని, జ్వరం లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.




ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వేలు నిర్వహించి జ్వర బాధితులను గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీఓ శ్రీ రామకృష్ణ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు పారిశుద్ధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించి, చెత్త తొలగింపు, మురుగు కాలువల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎంపీఓ ప్రదీప్ గ్రామస్థాయిలో ప్రజలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అనంతరం వెక్టర్ జనిత వ్యాధుల నివారణకు సంబంధించి వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి మండలాన్ని వ్యాధి రహితంగా ఉంచేందుకు కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి



**- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

జగిత్యాల, జూన్ 18: ( ప్రజా కలం ప్రతినిధి)ప్రత్యేక సమగ్ర పునర్విమర్శ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు)కు సూచించారు. గురువారం మల్లాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన బీఎల్ఓల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో బీఎల్ఓల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఇంటింటి సర్వే నిర్వహించి, ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారందరి పేర్లు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఓటర్ల నుంచి వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించాలని తెలిపారు. ఓటరు జాబితాల నాణ్యతను మెరుగుపరచడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావు లేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశంపై పూర్తి అవగాహన కలిగి ఉండడంతో పాటు ప్రజలకు అవసరమైన సమాచారం అందించి ఎన్నికల ప్రక్రియపై విశ్వాసాన్ని పెంపొందించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ రామచందర్ ఎంపీడీవో అలువల శ్రీకాంత్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి పేదవాడికీ ఇందిరమ్మ ఇల్లు

**- ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్**

నిర్మల్, జూన్ 18 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి): ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ గురువారం కుబీర్ మండల కేంద్రంలో విస్తృతంగా పర్యటించారు. ముందుగా ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఆయన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నిరుపేదల సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా అధికారులు బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. లబ్ధిదారులు ఈ మంజూరు పత్రాలను సద్వినియోగం చేసుకొని, త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆకస్మిక తనిఖీ: అనంతరం కుబీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో విద్యార్థుల హాజరు, బోధనా పద్ధతులు, మౌలిక వసతులను ఆయన పరిశీలించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులు, అధ్యాపకులతో నేరుగా మాట్లాడి విద్యా నాణ్యతపై ఆరా



తీశారు. విధి నిర్వహణలో ప్రిన్సిపాల్ నిర్లక్ష్యాన్ని గమనించిన ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యా ప్రమాణాల పెంపునకు అధ్యాపకులు కట్టుబడి ఉండాలని, విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలని స్పష్టం చేశారు.

రూ. 1 కోటితో సీసీ రోడ్ల పనులకు భూమిపూజ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు సుమారు రూ. 1 కోటి వ్యయంతో మండలంలో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ పర్యటనలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మృతి చెందిన మహిళ కు దహన సంస్కారాల కింద ఆర్థిక సహాయం

**- పాడేమోసి 20 వేల ఆర్థిక సాహయం అందించిన సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్**

ఎండపల్లి, జూన్ 18 : ( ప్రజా కలం ప్రతినిధి )



జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామం లో అప్పుల బాధతో తేదీ 16.06.2026 మంగళవారం రోజున ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న మడ్డీ ఇందిర భర్త మడ్డి రామయ్య బాంబులో ఉంటుండగా భర్త వచ్చేంత వరకు బాడీ బీజర్ లో డెడ్ బాడీని పెట్టి భర్త వచ్చిన తదుపరి అన్ని తానై మృతి చెందిన మడ్డి ఇందిరా దహన సంస్కారాలు చేసిన గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ దగ్గరుండి పాడే మోసి 20,000 వేల రూపా యల తో సంప్రదాయకంగా దహన సంస్కారాలు పూర్తి చేశారు. సర్పంచ్ గెలిచిన నుంచి ఇప్పటివరకు ఇద్దరికి తన సోంత ఖర్చుల తో దహన సంస్కారాలు పూర్తి చేశారు. ఈ సందర్భంగా గౌడ కులస్థులు, గ్రామ ప్రజలు గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ ను అభి నందించారు.

## బిఆర్ఎస్వీ విద్యార్థి విభాగ నాయకుల ముందస్తు అరెస్ట్




మల్లాపూర్, జూన్ 18: ( ప్రజా కలం ప్రతినిధి)

ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో అధిక ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్వి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో, మల్లాపూర్ మండలానికి చెందిన విద్యార్థి విభాగ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.

మల్లాపూర్ మండలానికి చెందిన నాయకులు బైరి రవికుమార్ యాదవ్, కాటిపెల్లి వినోద్ రెడ్డిలను మల్లాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ అరెస్టులు చేసినట్లు తెలిసింది. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పెరుగుతున్న ఫీజులను తగ్గించి విద్యార్థులు, తల్లిదండ్రులపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించాలని నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## జగ్గాసాగర్‌లో గోశాల ప్రతిష్టాపన

**కామధేనువు మాత విగ్రహానికి ప్రజా దర్బార్ ప్రతినిధి బోన్ల రమేష్ నేతృత్వం**



మెట్ పల్లి రూరల్,జూన్ 18 :(ప్రజా కలం):

మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు బోన్ల రమేష్ నిర్మించిన గోశాలలో కామధేనువు మాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని బండా లింగాపూర్ వాస్తవ్యులు, ప్రముఖ పండితులు మాధవాచార్యులు వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగ్గాసాగర్ గ్రామ సర్పంచ్ పుల్ల జగన్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే బండా లింగాపూర్ గ్రామ వాస్తవ్యులు, నమో మిషన్ వందేమాతరం మస్కట్ శాఖ అధ్యక్షులు ఇట్టేడి ప్రతాప్ రెడ్డి పాల్గొని గోసేవ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. గోశాల నిర్మాణం ద్వారా గోవుల సంరక్షణకు కృషి చేస్తున్న బోన్ల రమేష్‌ను అభినందించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, భక్తులు, గోభక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కామధేనువు మాత ఆశీస్సులు పొందారు. కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## నేడు జిల్లాలో ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి పర్యటన

ఖమ్మం నగరంలోని పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి శుక్రవారం రోజున జిల్లాలో పర్యటించనున్నారు. తొలుత ఉదయం 10:15 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఖమ్మంలోని గట్టయ్య సెంటర్ లో గల క్యాంప్ కార్యాలయంలో ఎంపీ అందుబాటులో ఉంటారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేణులను కలుసుకుని వారి విజ్ఞప్తులను స్వీకరిస్తారు. మధ్యాహ్నం 12:30 గంటల నుంచి 1:30 గంటల వరకు జిల్లాలో పలు ప్రైవేట్ కార్యక్రమాలకు హాజరవుతారు. ఆ తర్వాత మధ్యాహ్నం 3:30 గంటలకు కల్లూరులోని ఇండోర్ స్టేడియంకు చేరుకుంటారు. అక్కడ క్రీడా సౌకర్యాల కల్పన కోసం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. ఈ మేరకు ఎంపీ క్యాంప్ కార్యాలయం నుంచి గురువారం సాయంత్రం ఓ ప్రకటన వెలువడింది.



ప్రజా కలం
శుక్రవారం, జూన్ 19, 2026

# మళ్లీ తెరపైకి డిలిమిటేషన్

జనాభా ఆధారిత డీలిమిటేషన్ ఫార్ములాను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. జనాభా నియంత్రణను పక్కాగా అమలు చేసి, దేశ ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నందుకు తమకు సీట్లను తగ్గించి శిక్షిస్తారా? అని చంద్రబాబు నాయుడు, స్టాలిన్ వంటి నేతలు ఇప్పటికే బహిరంగంగానే ప్రశ్నించారు. ఒకవేళ కేంద్రం 50 శాతం పెంపు ఫార్ములాను మొండిగా ముందుకు తీసుకెళ్తే దక్షిణాది పార్టీలు ఖచ్చితంగా వ్యతిరేకిస్తాయి. అయితే, ఒకవేళ ప్రధాని ఆర్థిక సలహా మండలి ప్రతిపాదించిన 'టార్గెటెడ్ అండ్ వెయిటెడ్' పద్ధతిని ప్రవేశపెట్టి.. జనాభా నియంత్రించిన రాష్ట్రాలకు ప్రత్యేక వెయిటేజీ ఇస్తే మాత్రం దక్షిణాది పార్టీలు ఆ ఫార్ములాకు ఓటేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టంగా మారినప్పటికీ, అది అమలు కావాలంటే డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తి కావడం సాంకేతికంగా అత్యంత కీలకం. ఉత్తరాదిలోని ఎస్పీ, ఆర్జేడీ వంటి పార్టీలు కోటాలో కోటా ఓబీసీ మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ డిమాండ్ చేస్తున్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే డీలిమిటేషన్ బిల్లు, ఒక దేశం, ఒక ఎన్నిక బిల్లు రెండింటికీ పార్లమెంటరీ ఆమోదం పొందాలని ప్రభుత్వం ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తున్నది. డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపచేయడానికి ప్రభుత్వం గతంలో చేసిన ప్రయత్నానికి పార్లమెంట్‌లో అవసరమైన మద్దతు లభించకపోవడంతో ఈ అంశం మళ్లీ వెలుగులోకి వచ్చింది. అయితే, పార్లమెంట్‌లో ఎన్డీఏ బలం పెరుగుతున్న తరుణంలో, మహిళా ఓటర్ల మద్దతును పూర్తిగా స్వంతం చేసుకోవడానికి కేంద్రం ఈ రెండు బిల్లులను ఒకేసారి ముడిపెట్టి ఆమోదించే వ్యూహంతో ముందుకు వెళ్తోందిరాబోయే రోజుల్లో డీలిమిటేషన్ చర్చ కేవలం సీట్ల సంఖ్యకు పరిమితం కాకుండా.. భారతదేశ సమాఖ్య స్ఫూర్తి కి ఒక పెద్ద పరీక్షగా మారబోతోంది. మోదీ ప్రభుత్వం పార్లమెంట్‌లో లభించిన 2/3 వంతు మెజార్టీతో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటుందా, లేదా దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని ఆర్థిక సలహా మండలి సూచించిన సమతుల్య ఫార్ములా వైపు మొగ్గు చూపుతుందా అనేది తేలాల్సి ఉంద దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన , మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుపై రాజకీయ సమీకరణాలు అత్యంత వేగంగా మారుతున్నాయి. గతంలో ఎన్డీఏ కూటమికి పార్లమెంట్‌లో మూడింట రెండు వంతుల మెజార్టీ లేకపోవడం వల్ల ఈ రాజ్యాంగ సవరణల ప్రక్రియ సాధ్యం కాదనే చర్చ నడిచింది. అయితే, లోక్‌సభలో అనూహ్యంగా తృణమూల్ కాంగ్రెస్ కి చెందిన సుమారు 20 మంది ఎంపీలు ప్రభుత్వానికి మద్దతుగా నిలవడం, ఇండీ కూటమిలోని సమాజ్‌వాదీ పార్టీ వంటి కొన్ని ప్రాంతీయ పార్టీలు కూడా మహిళా రిజర్వేషన్ల క్రెడిట్ కోసం సానుకూల సంకేతాలు ఇస్తుండటంతో మోదీ-షా ద్వయానికి అవసరమైన సంఖ్యాబలం సమకూరుతున్నట్లు స్పష్టమవుతోంది. అసలు డీలిమిటేషన్ ఏ ప్రాతిపదికన జరగబోతోంది? దక్షిణాది రాష్ట్రాల భవిష్యత్తు ఏంటి? ఈ ఫార్ములా ప్రకారం.. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ సీట్ల సంఖ్యను నేరుగా దాదాపు 50 శాతం పెంచుతారు. కొత్త పార్లమెంట్ భవనాన్ని కూడా ఇదే సంఖ్యాబలానికి అనుగుణంగా నిర్మించారు. కేవలం జనాభా ప్రాతిపదికన సీట్లను పెంచితే, జనాభా నియంత్రణ పాటించని ఉత్తరాది రాష్ట్రాలకు భారీగా సీట్లు పెరుగుతాయి. ఇటీవల పలు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాజకీయ సమీకరణాలు గణనీయంగా మారిపోయాయి. తమిళనాడు ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్-డీఎంకే కూటమి విచ్ఛిన్నమైందన్న వార్తలు చర్చనీయాంశంగా ఉన్న కీలక పరిణామాల్లో ఒకటి. బిల్లుకు విస్తృత మద్దతు కూడగట్టే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వం డీఎంకేను సంప్రదించే ప్రయత్నాలను ప్రారంభించినట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. అదే సమయంలో తృణమూల్ కాంగ్రెస్‌లోని పరిణామాలను కూడా నిశితంగా గమనిస్తున్నారు. ఒకవేళ గణనీయ సంఖ్యలో ఎంపీలు టీఎంసీ నుంచి విడిపోతే అది పార్లమెంటరీ సమీకరణాలను మార్చివేసి బిల్లు ఆమోదానికి అవసరమైన మద్దతును కూడగట్టడంలో ప్రభుత్వానికి సులభతరం చేస్తుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. పోయినసారి డీలిమిటేషన్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టినపుడు దాని ఆమోదం పొందేందుకు ప్రభుత్వానికి మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరమైంది. అంటే బిల్లుకు అనుకూలంగా కనీసం 362 ఓట్లు అవసరం. అయితే బిల్లుకు 298 మంది సభ్యుల మద్దతు మాత్రమే లభించింది. బిల్లుకు వ్యతిరేకంగా 230 మంది ఎంపీలు ఓటు వేశారు. ఫలితంగా బిల్లుకు అవసరమైన సంఖ్యాబలం దక్కక సభలో వీగిపోయింది. జనాభా ప్రాతిపదికన మాత్రమే సీట్లు పెంచితే దేశ సమగ్రతకు, సమాఖ్య స్ఫూర్తికి నష్టం వాటిల్లుతుందని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఒక ప్రత్యామ్నాయాన్ని సూచించింది. కేవలం జనాభాయే కాకుండా.. భౌగోళిక విస్తీర్ణం, ఆర్థిక వృద్ధి, అక్షరాస్యత వంటి వివిధ సూచీలను పరిగణనలోకి తీసుకుని 'టార్గెటెడ్ నియోజకవర్గాల విభజన' చేయాలని ప్రతిపాదించింది.

## జిల్లా ఎస్సీ , ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ అండ్ విజిలెన్స్ కమిటీ సభ్యులుగా పెంటనోళ్ళ నరసింహ మాదిగ

### - సత్కరించిన ఎమ్మార్పీఎస్ నందిగామ మండల ఇంచార్జి చెన్నగళ్ల అశోక్ మాదిగ, కో ఇంచార్జి కర్మురి సాయి



నందిగామ జూన్ 18 ప్రజా కలం : ఈసందర్భంగా చెన్నగళ్ళ అశోక్ మాదిగ మాట్లాడుతూ పెంటానోళ్ల నర్సింహాను వారి స్వగృహం న కలిసి శాలువా తో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందని అదే విధంగా
రంగారెడ్డి జిల్లా స్థాయి ఎస్సీ , ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ అండ్ విజిలెన్స్ కమిటీ సభ్యులుగా కొత్తూరు మండలం ఇన్ముల్ నర్వ గ్రామానికి చెందిన పెంటనోళ్ళ నరసింహ మాదిగ నియమితులు కావడం షాద్నగర్ నియోజకవర్గంనుంచి రంగారెడ్డి జిల్లా ఎస్సి ఎస్టీ అట్రాసిటీ మనిటరింగ్ కమిటీ లో పెంటన్నోళ్ల నరసింహ మాదిగకు చోటు దక్కడం చాలా సంతోషకరం అని ఎమ్మార్పిస్ నందిగామ మండల ఇంచార్జి చెన్నగళ్ళ అశోక్ మాదిగ అన్నారు . ఈ మేరకు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు గారికి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్న నరసింహకు శుభాకాంక్షలు తెలియజేశారు .
పెంటనోళ్ల నరసింహ మాదిగ గారు ప్రస్తుతం మందకృష్ణ మాదిగ గారి నాయకత్వంలో నడుస్తున్న ఎం ఆర్ పి ఎస్ ఉద్యమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా పని చేయుచున్నారు. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా దళిత, గిరిజన, బలహీన వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అనేక సామాజిక ఉద్యమాలను చేపట్టిన అనుభవం నరసింహ గారికి ఉంది. అంతేకాకుండా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం చేసిన చరిత్ర ఉన్నది. అందువల్లనే నరసింహ గారి సేవా దృక్పథం, దళిత గిరిజన ప్రజలతో ఉన్న అనుబంధం, అనేక సామాజిక కార్యక్రమాలను చేపట్టిన అనుభవం ఉన్న కారణంగా గుర్తించి జిల్లాస్థాయి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ అండ్ విజిలెన్స్ కమిటీలో సభ్యులుగా నియమించడం జరిగింది. సందర్భంగా వారు అన్నారు.
ఈ సందర్భంగా పెంటనోళ్ళ నరసింహ మాదిగ మాట్లాడుతూ ఈ స్థాయి గుర్తింపు రావడానికి కారకులైన ఎం ఆర్ పి ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారికి కృతజ్ఞతలు తెలిపారు అలాగే తనపై నమ్మకంతో తన సేవను గుర్తించి ఈ అవకాశం కల్పించిన జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి గారికి అలాగే షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు గారికి కృతజ్ఞతలు తెలిపారు. దళిత గిరిజన వర్గాల సంక్షేమం కోసం వారిపై జరుగుతున్నటువంటి దాడులు, దౌర్జన్యాలు, వివక్షత అణిచివేతలను నిరోధించడం కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఎం ఆర్ పి ఎస్ నందిగామ మండల ఇంచార్జి చెన్నగళ్ళ అశోక్ మాదిగ
కో ఇంచార్జి కార్మురి సాయి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలే విద్యార్థుల భవిష్యత్‌కు బలమైన పునాది

### నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలతో ప్రభుత్వ బడుల వైపు తల్లిదండ్రుల మొగ్గు : గ్రామ సర్పంచ్ చిటూరి రాజు

జూన్ 17 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ /వర్ధన్నపేట)



ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని అంబేద్కర్ నగర్ గ్రామ సర్పంచ్ చిటూరి రాజు అన్నారు. వర్ధన్నపేట మండలంలోని అంబేద్కర్ నగర్ గ్రామంలో సర్పంచ్ చిటూరి రాజు ఆధ్వర్యంలో గ్రామ 5వ వార్డు సభ్యుడు యాకర సందీప్ కుమారుడిని ప్రైవేట్ పాఠశాల నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడిన సర్పంచ్, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న విద్యా విధానాల పట్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని, అందువల్లే తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని, విద్యార్థులపై చదువు ఒత్తిడిని పెంచుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన బోధన అందుతోందని తెలిపారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఉచిత యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌తో పాటు క్రీడా సామగ్రి, ఆట స్థలాలు వంటి సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని వివరించారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలోనే చేరి విద్యాభ్యాసం కొనసాగించేలా గ్రామస్థులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై నిరంతరం దృష్టి సారించాలని, అవసరమైతే పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల పురోగతిని తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మాదిగ విద్యార్థుల అక్షరాస్యతే అభ్యున్నతికి బాట

### -గో టు విలేజ్ కార్యక్రమంలో విద్య ప్రాధాన్యంపై అవగాహన

### -ఎస్సీ వర్గీకరణ ఫలాలు పొందాలంటే చదువే మార్గమని ధర్మయ్య మాదిగ పిలుపు



జూన్ 18 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ /వర్ధన్నపేట)
వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కొత్తపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన "గో టు విలేజ్" కార్యక్రమంలో మాదిగ, మాదిగ ఉపకులాల విద్యార్థుల్లో అక్షరాస్యత పెంపొందించడం, వారిని ఉన్నత శిఖరాలకు చేర్చడం ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ ప్రధాన లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వర్ధన్నపేట మండల ఎంఆర్‌పీఎస్-ఎంఎస్‌పీ ఇన్‌చార్జి జిల్లా ధర్మయ్య మాదిగ మాట్లాడుతూ, అన్ని విధాలుగా వెనుకబాటుతనానికి గురైన మాదిగ, మాదిగ ఉపకులాల విద్యార్థుల్లో విద్యా చైతన్యం పెంపొందించి వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు సంస్థలు కృషి చేస్తున్నాయని తెలిపారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మాదిగ పల్లెలు, బస్తీల్లో "గో టు విలేజ్" కార్యక్రమాలను, నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎంతో పోరాటంతో సాధించుకున్న ఎస్సీ వర్గీకరణ ఫలాలను, సంపూర్ణంగా, అందిపుచ్చుకోవాలంటే చదువే ఏకైక మార్గమని ఆయన స్పష్టం చేశారు. రాబోయే జూలై 7న ఎంఆర్‌పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ప్రతి మాదిగ పల్లెలో దండోరా నూతన దిమ్మలను ఏర్పాటు చేసి, పండుగ వాతావరణంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అందుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు ప్రారంభించాలని సూచించారు. ఈ చైతన్య సదస్సులో ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు ముత్యాల మల్లేశం మాదిగ, ఎంఆర్‌పీఎస్ మండల ఉపాధ్యక్షుడు చాడ కర్ణాకర్ మాదిగ పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బీస్‌పాక సామి మాదిగ, బీస్‌పాక వీరసామి మాదిగ, బీస్‌పాక సుమన్ మాదిగ, ఆకులపెల్లి అఖిల్ మాదిగ, బీస్‌పాక స్వామి సైదులు మాదిగ, తుల అఖిల్ మాదిగ, పూల కోమల మాదిగ, బీస్‌పాక ఎల్లమ్మ మాదిగ తదితరులు పాల్గొన్నారు. అలాగే విద్యార్థులు బి. బ్లెస్సి, బి. తేజ, బి. అనూష, బి. శ్రావణ్‌కుమార్, జన్ను విన్ను, కె. విమల తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## విద్యారణ్య విద్యాలయ స్కూల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే



గద్వాల ప్రతినిధి (ప్రజాకలం న్యూస్)
జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలో అయిజ పట్టణ కేంద్రంలో, భారత్ నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన 'విద్యారణ్య విద్యాలయ'ను అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు, అయిజ మున్సిపాలిటీ చైర్మన్ సీఎం సురేష్ కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం పాఠశాల తరగతి గదులను పరిశీలించి, నూతన క్రికెట్ క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, క్రమశిక్షణ, మంచి అలవాట్లను అలవర్చాలని యాజమాన్యానికి సూచించారు.
దీనికి స్కూల్ యాజమాన్యం సానుకూలంగా స్పందిస్తూ తప్పకుండా విద్యార్థులకు మంచి విద్య బోధన అందిస్తూ, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ముందుకు వెళ్తామని స్కూల్ యజమాన్యం అన్నారు,
ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శివ, డాక్టర్ కృష్ణ, కో-ఆప్షన్ సభ్యులు నాగన్న గౌడ్ మౌల, బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీసీ విద్యార్థులకు ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల రెన్యువల్ షురూ



నిర్మల్ ,జూన్ 18(ప్రజా కలం జిల్లా ప్రతినిధి):
బీసీ విద్యార్థుల ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల రెన్యువల్ ప్రక్రియ ప్రారంభమైందని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి డి.శ్రీనివాస్ తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న అర్హులైన బీసీ విద్యార్థులు వెంటనే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుదారులు బీసీ కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డ్, నివాస ధ్రువీకరణ పత్రం మరియు ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంక్ ఖాతా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత, దరఖాస్తు పత్రాల జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలి. పూర్తి వివరాల కోసం నేరుగా కార్యాలయాన్ని సందర్శించవచ్చని, సందేహాల నివృత్తికై 9849290043 నంబరును సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

## పోయిన బంగారం బాధితుడికి అప్పగింత

### ఎస్సై కొండ శ్రీహరి



గద్వాల ప్రతినిధి (ప్రజాకలం న్యూస్)జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని గురువారం ఉదయం 11:00 గంటలకు ఎం.పి.డి.ఓ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న హుమేరా బేగం మల్దకల్ పోలీస్ స్టేషన్‌లో బంగారం పోయిందని ఫిర్యాదు చేశారు. ఆమె మల్దకల్ బస్ స్టాండ్ వద్ద బస్సు నుండి దిగిన తర్వాత కార్యాలయానికి నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో సుమారు 1.8 తులాల బంగారు బ్రేస్‌లెట్ పోగొట్టుకున్నట్లు ఎస్సై కొండ శ్రీహరి తెలిపారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే పోలీస్ స్టేషన్ సమీప దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. విచారణలో పేద్దొడ్డి గ్రామానికి చెందిన ఒక మహిళ రోడ్డుపై పడి ఉన్న ఆ బ్రేస్‌లెట్‌ను తీసుకున్నట్లు గుర్తించారు. హెచ్ సి. గోపాల్ నాయక్, బ్లూ కోల్ట్ సిబ్బంది పీసీ ఇస్మాయిల్, పీసీ సురేష్ ఆ మహిళను గుర్తించి,ఆమె వద్ద నుండి బంగారు బ్రేస్‌లెట్‌ను స్వాధీనం చేసుకుని, ధృవీకరణ అనంతరం యజమానికి ఎస్సై అప్పగించారు.

## ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలి

### - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



నిర్మల్,జూన్ 18(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రజలంతా బాధ్యతగా మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు.
జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం వనమహోత్సవం కార్యక్రమం ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా మామడ మండలం లింగాపూర్ తండాలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలువురు అధికారులు, విద్యార్థులతో కలిసి సామూహికంగా మొక్కలు నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రజలంతా విరివిగా మొక్కలు నాటాలన్నారు. మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యతను కాపాడే ఈ మహా కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలని వివరించారు.
అంతకుముందు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్రంగూడా ఈకో పార్కును ప్రారంభం చేసి వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటిన కార్యక్రమాన్ని, మామడ మండల కేంద్రంలోని రైతు వేదికలో కలెక్టర్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు.
ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, డిఆర్డిఓ విజయలక్ష్మి, తహసిల్దార్ శ్రీనివాస్, రైతులు, విద్యార్థులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి పరామర్శించిన సర్పంచ్ కొండ రాజమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు ఐత రాజిరెడ్డి



మల్హర్, జూన్ 18 ప్రజాకలం ప్రతినిధి : ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు ఆదేశాల మేరకు గురువారం రోజున ఇటీవల మృతి చెందిన ఏటెల్లి రాజయ్య కుటుంబాన్ని కొయ్యూరు సర్పంచ్, సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు కొండ రాజమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు ఐత రాజిరెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేసి, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహేందర్ రెడ్డి, లకవత్ రాజేందర్, పెరమండ్ల మల్లేష్, కటకం శ్రీనివాస్, ఆంబోతు రవీందర్, వెన్నపురెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బత్తుల మల్లేష్, ధారావత్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆసరా పెన్షనర్ల కోసం పోస్టాఫీస్ ఖాతాలు తెరిపించాలి

### - సబ్‌పోస్ట్ మాస్టర్‌కు సర్పంచ్‌ల వినతి, జీపీల్లో ఏకగ్రీవ తీర్మానం

( వరంగల్/పర్వతగిరి) జూన్ 18, ప్రజాకలం ప్రతినిధి ఆసరా పెన్షన్ లబ్ధిదారుల సౌకర్యార్థం గ్రామాలలోని పెన్షనర్లందరికీ పోస్టాఫీస్ సేవింగ్స్ ఖాతాలు తెరిపించాలని మోత్యా తండా సర్పంచ్ భూక్య నరేష్ కోరారు. ఈ విషయమై మోత్యా తండాతో పాటు రావూరు సర్పంచ్ సుభద్రలు గ్రామ పంచాయతీలలో కూడా ప్రత్యేకంగా చర్చించి, ఏకగ్రీవ తీర్మానాలు ఆమోదించారు. ఈ మేరకు గురువారం పర్వతగిరి సబ్‌పోస్ట్ మాస్టర్ కరుణాకర్‌కు సర్పంచ్‌లు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పెన్షన్లను రాబోయే ఒకటి రెండు నెలల్లో నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించినట్లు తెలిసిందన్నారు. అయితే మోత్యా తండా, రావూరు గ్రామాల్లోని పెన్షన్ లబ్ధిదారులలో ఎక్కువ మంది వృద్ధులు, నిరక్షరాస్యులు ఉన్నారని పేర్కొన్నారు. వీరంతా ప్రతి నెలా బ్యాంకుకు వెళ్లి డబ్బులు డ్రా చేయడం చాలా ఇబ్బందికరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరక్షరాస్యులకు ఏటీఎం కార్డులు జారీ కావని, ఒకవేళ వేలిముద్రలతో బ్యాంకులో నగదు తీసుకోవాలన్నా సాక్షి సంతకం కోసం మరొకరిపై ఆధారపడాల్సి వస్తుందని వివరించారు. ఈ సమస్యలన్నింటికీ పోస్టాఫీస్ ఖాతానే ఉత్తమ పరిష్కారమని భావించి, ఆయా గ్రామ పంచాయతీల్లో లబ్ధిదారుల ప్రయోజనాల కోసం ప్రత్యేక తీర్మానాలు చేసినట్లు తెలిపారు. పోస్టాఫీస్ ద్వారా అయితే లబ్ధిదారులు తమ గ్రామంలోనే సులభంగా పెన్షన్ డబ్బులు పొందే వీలుంటుందని, కాబట్టి తక్షణమే ఈ మూడు గ్రామాల పరిధిలోని ఆసరా లబ్ధిదారులందరికీ పోస్టాఫీస్ సేవింగ్స్ ఖాతాలు తెరవాలని సబ్‌పోస్ట్ మాస్టర్‌ను విజ్ఞప్తి చేశారు.



### మండల ప్రగతికి మంత్రి శ్రీధర్ బాబు పెద్దపీట...

## కోటి నిధులు మంజూరు!

### హర్షం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు

మల్హర్,జూన్18 ప్రజాకలం ప్రతినిధి... భూపాలపల్లి జిల్లాలోని మలహర్ రావు మండలానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద నూతన గ్రామపంచాయతీ బిల్డింగ్ లు,సిసి రోడ్లు, డ్రైనేజీలు ఇతర అభివృద్ధి పనులకు గాను మండలానికి కోటి రూపాయల నిధులు మంజూరు చేయించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు. మండలానికి నిధులు మంజూరు చేయించిన మంత్రి శ్రీధర్ బాబుకు పిఎసి పిఎస్ చైర్మన్ ఇప్పమొండయ్య,మాజీ ఎంపీపీ మలహల్ రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బడితల రాజయ్య లు ఒక సంయుక్త ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపుతూ హర్షం వ్యక్తం చేశారు.గ్రామాల వారీగా నిధులు అడ్వాలపల్లి ఐదు లక్షలు,అన్సాన్ పల్లి ఐదు లక్షలు, చిన్నతుండ్ల ఐదులక్షలు,ఎడ్లపల్లి ఐదు లక్షలు, ఇప్పలపల్లి ఐదు లక్షలు, కొండం పేట ఐదు లక్షలు, మల్లంపల్లి ఐదు లక్షలు మల్లారం ఐదు లక్షలు, నాచారం ఐదు లక్షలు, పెద్దతుండ్ల పది లక్షలు, గాదంపల్లి ఐదు లక్షలు,రుద్రారం 15 లక్షలు, తాడిచెర్ల 15 లక్షలు, వల్లేకుంట ఐదు లక్షలు మంజూరైనవి అని తెలిపారు. నిధులు మంజూరు పట్ల సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు కొండ రాజమ్మ, సర్పంచులు జంగిడి శ్రీనివాస్, బెల్లంకొండ జోత్స్న సరీన్ రావు, బండారి నర్సింగం, గడ్డం క్రాంతి, మేకల రాజయ్య, చంద్రగిరి సంపత్ లు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

## సాధారణ బదిలీలపై వెళ్లుతున్న ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీడీవో మాలోతు శంకర్ నాయక్

( వరంగల్/ పర్వతగిరి) జూన్ 18, ప్రజాకలం ప్రతినిధి.

మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ బదిలీలపై ఇతర ప్రాంతాలకు వెళ్తున్న పంచాయతీ కార్యదర్శులు, మినిస్ట్రియల్ స్టాఫ్, పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్స్ ( పిఆర్ఏఈ ) గార్లకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్, ఎంపీఓ శేషు మాట్లాడుతూ, బదిలీపై వెళ్తున్న ఉద్యోగులు తమ విధినిర్వహణలో చూపిన అంకితభావం, క్రమశిక్షణ ప్రజాసేవా దృక్పథాన్ని అభినందించారు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలు, పంచాయతీ పరిపాలన బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ పథకాల విజయవంతమైన అమలులో వారి సేవలు విశేషమైనవని కొనియాడారు. అనంతరం బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శులు, మినిస్ట్రియల్ స్టాఫ్, పిఆర్ఏఈ లను శాలువతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. వారి కొత్త విధి స్థానాల్లో మరింత ఉన్నత స్థాయిలో సేవలందిస్తూ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే ఇతర ప్రాంతాల నుండి మన మండలంనకు వచ్చిన కార్యాలయం సూపరింటెండెంట్, పంచాయతీ కార్యదర్శులు తదితరులను సన్మానించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న ఉద్యోగులు మాట్లాడుతూ, తమ సేవాకాలంలో సహకరించిన ఎంపీడీవో, ఎంపీఓ, సహోద్యోగులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సుశీల్ కుమార్, ఉపాధి హామీ సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, మినిస్ట్రియల్ స్టాఫ్, పిఆర్ఏఈ లు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

### - గ్రామ సర్పంచ్ చిటూరి రాజు

### - కొడుకును ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఆదర్శంగా వార్డ్ సభ్యుడు

వర్ధన్నపేట, జూన్ 17 (ప్రజా కలం ప్రతినిధి )

వర్ధన్నపేట మండలంలోని అంబేద్కర్ నగర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు గ్రామ సర్పంచ్ చిటూరి రాజు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ 5వ వార్డు సభ్యుడు యాకర సందీప్ తన కుమారుడిని ప్రైవేట్ పాఠశాల నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిటూరి రాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణలు, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాల కల్పన కారణంగా తల్లిదండ్రులు ప్రభుత్వ విద్య వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని, విద్యార్థులపై చదువు ఒత్తిడి పెంచి మానసిక ప్రశాంతతను దూరం చేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తోందని పేర్కొన్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఉచిత యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌తో పాటు క్రీడా సామగ్రి, ఆట స్థలాల ఏర్పాటుతో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.



గ్రామంలోని ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరి విద్యాభ్యాసం కొనసాగించేలా తల్లిదండ్రు లు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, అవసరమైతే పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల పురోగతిని తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఓవర్ నైట్ లో కింగ్ మేకర్ అయిన ఎన్‌సీపీఐ

న్యూఢిల్లీ : నిన్నటిదాకా ఓ చిన్న రాజకీయ పార్టీగా ఉన్న నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ) ఇప్పుడు ఒక్కసారిగా భారత రాజకీయాల్లో ప్రధాన చర్చనీయాంశంగా మారింది. తృణమూల్ కాంగ్రెస్‌లో చెలరేగిన తిరుగుబాటులో ఎన్‌సీపీఐ వార్తల్లో నిలిచింది. 2023 లెక్కల ప్రకారం రూ. 75 నగదు మాత్రమే ఉన్న ఈ పార్టీ ఇప్పుడు లోక్‌సభలో కింగ్‌మేకర్‌గా మారనుంది.బెంగాల్‌లో రాజకీయ సంక్షోభం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత అధికారం కోల్పోయిన తృణమూల్ కాంగ్రెస్‌లో చీలికలు ఏర్పడ్డాయి. 20 మంది లోక్‌సభ సభ్యులు పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి ఎన్‌సీపీఐలో విలీనం అవుతామని, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి మద్దతు ఇస్తామని ప్రకటించారు.తృణమూల్ కాంగ్రెస్ ఎంపీల విలీనాన్ని స్పీకర్ ఆమోదిస్తే ఇప్పటి వరకు పెద్దగా రాజకీయ ప్రభావం లేని ఎన్‌సీపీఐ ఒక్కసారిగా లోక్‌సభలో ఐదో అతిపెద్ద పార్టీగా, ఎన్డీయేలో రెండో అతిపెద్ద భాగస్వామ్య పార్టీగా అవతరించే అవకాశం ఉంది. తిరుగుబాటు ఎంపీలంతా కలిసి లోక్‌సభ స్పీకర్‌ను కలిసి సభలో తమకు ప్రత్యేకంగా సీటింగ్ ఏర్పాటు చేయాలని కూడా కోరారు. మూడింట రెండొంతుల మద్దతు కూడా తమకు ఉందని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.ఇక నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ) 2023 జనవరిలో భారత ఎన్నికల సంఘం వద్ద నమోదయింది. ఎన్నికల సంఘం రికార్డుల ప్రకారం ఈ పార్టీ కార్యాలయం పశ్చిమ బెంగాల్‌లోని హౌరా జిల్లా సంకరైల్ ప్రాంతంలో ఉంది. 2022 – 23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ నివేదిక ప్రకారం పార్టీకి మొత్తం రూ. 1,13,075 విరాళాల రూపంలో వచ్చాయి. దాదాపు పార్టీ మొత్తం నిధులు ఖర్చు చేసింది. ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి పార్టీ ఖజానాలో కేవలం రూ. 75 మాత్రమే మిగిలిందని ప్రకటించింది. 2023లో త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి పార్టీ ఖర్చుల్లో దాదాపు రూ. 49,400ను వినియోగించింది. ఇది పార్టీ తొలి ఎన్నికల ప్రయత్నాల్లో ఒకటిగా చెబుతున్నారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు షెల్లీ కుండు రూ. 15 వేల విరాళం ఇవ్వగా, ఉపాధ్యక్షుడు ఉత్తియా కుండు రూ. 18 వేల విరాళం అందించారు. 2023 – 24, 2024 – 25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన విరాళాలు, ఆడిట్ నివేదికలు ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ప్రస్తుతం అందుబాటులో లేవు. మొత్తానికి రూ. 75 నగదుతో ఉన్న చిన్న పార్టీ ఇప్పుడు దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించడం ఆసక్తికరంగా మారింది.

## దేవాలయాల్లో దొంగలు పడ్డారు

చెన్నై : తమిళనాడులో మన దేశంలోనే ఎక్కువగా ఆలయాలు ఉంటాయి. దీనిని టెంపుల్ స్టేట్ అని పిలుస్తుంటారు. రామేశ్వరాలయం నుంచి మొదలుపెడితే మీనాక్షి వరకు విశిష్టమైన ఆలయాలు తమిళనాడులో ఉంటాయి. ఇక్కడ ఆలయాలు వందల ఎకరాలలో ఉంటాయి. పైగా ఆలయ పరిసర ప్రాంతాల్లోనే వాణిజ్యసముదాయాలు.. ఇతర నిర్మాణాలు ఏర్పాటు చేశారు.. వీటిని అద్దెకు ఇవ్వడం ద్వారా వచ్చిన సొమ్మును ప్రభుత్వం తీసుకుంటుంది. తమిళనాడులో ఆలయాల ఆస్తుల మీద ప్రభుత్వానికి మాత్రమే హక్కు ఉంటుంది.ఇంతటి స్థాయిలో ఆస్తులు ఉన్నప్పటికీ ఆశించిన విధంగా ఆదాయం రావడం లేదు. ఆదాయం వచ్చే అవకాశం ఉన్నప్పటికీ అధికారంలో ఉన్న పార్టీ నాయకులు అడ్డగోలుగా దోచుకోవడం మొదలుపెట్టారు. తమకు అనుకూలమైన వ్యక్తులకు ఆ వాణిజ్య సముదాయాలను అద్దెకు ఇవ్వడం ప్రారంభించారు. దేవస్థానాలకు కాకుండా .. తమ సొంత జేబుల్లోకి ఆ ఆదాయాన్ని మళ్ళించుకున్నారు. ఫలితంగా గడిచిన కొన్ని సంవత్సరాలుగా దాదాపు 60 వేల కోట్ల ఆదాయం పక్కదారి పట్టింది. వాస్తవానికి వేలకోట్ల ఆదాయం వందల కోట్లకు పడిపోయింది. ప్రభుత్వ పెద్దలకు ఇందులో పాత్ర ఉండడంతో పోలీసులు కూడా ఏమీ చేయలేకపోయారు.ఇటీవల తమిళనాడులో ఒక వ్యక్తి ఈ వ్యవహారాన్ని సమాచార హక్కు ద్వారా బయటికి తీసుకొచ్చాడు. అంతేకాదు కోర్టు దాక కూడా వెళ్ళాడు. దీనిపై కేసు విచారణలో ఉంది. ఒకవేళ కేసు విచారణకు వస్తే తమిళనాడు ప్రభుత్వం కచ్చితంగా దోషిగా నిలబడుతుంది. ఒకవేళ కోర్టు ఆ డబ్బు మొత్తం చెల్లించాలని చెప్పినప్పటికీ ఎవరు చెల్లిస్తారు.. ఆ డబ్బు చెల్లించడానికి ఎవరు ముందుకు వస్తారు.. అన్నాడిఎంకె.. డీఎంకే ద్రావిడ వాదాన్ని తలకెత్తుకున్నాయి. కానీ ఓ వర్గాలను మెప్పించడానికి హిందువులను తొక్కేశాయి. అంతేకాదు, దేవాలయ ఆస్తులను కూడా ఆక్రమించాయి. ఓ నివేదిక ప్రకారం తమిళనాడులో చాలావరకు ఆలయాలలో ఆస్తులు అన్యాక్రాంతం అయిపోయాయి. ఇందులో డీఎంకే.. అన్న డీఎంకే పార్టీ నేతల హస్తముంది ఇప్పుడు టీవీకే నేతలు కూడా అదే పని చేస్తారు. అలాంటప్పుడు ఈ దుర్మార్గుల భరతాన్ని ఎవరు బయటపెడతారు.. సాక్షాత్తు ఆ దేవుడే దిగి వస్తే తప్ప ఈ ఆక్రమాలకు పాల్పడిన దుర్మార్గుల అసలు రంగు బయటపడదు.

## గ్రామీణ ఆరోగ్యానికి భరోసా ఆర్ఎంపీ, పీఎంపీలే..

### – కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

కరీంనగర్ : ఏళ్ల పాలన నేపథ్యంలో మానకొండూరులో ఆర్ఎంపీ, పీఎంపీలతో కేంద్ర మంత్రి 'చాయ్ పే చర్చ'తమపై దాడులను అరికట్టాలని కేంద్ర మంత్రికి ఆర్ఎంపీల వినతి.సంఘ భవనానికి ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తితెలంగాణ మెడికల్ కౌన్సిల్ మాపై దాడులు చేస్తున్నారు మమ్ముల్ని ఇబ్బందులు పెడుతున్నారు. గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి భరోసా ఆర్ఎంపీ, పీఎంపీలేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్ఎంపీ, పీఎంపీలు లేని గ్రామీణ సమాజాన్ని ఊహించుకోలేమని చెప్పారు. అలాంటి వారిపై దాడులు చేయడం సరికాదని, ప్రభుత్వం ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని కోరారు. గ్రామీణ వైద్యులు సేవలు నిలిపేస్తే ఆరోగ్య వ్యవస్థ స్థంభించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రధాని నరేంద్రమోదీ 12 ఏళ్ల పాలనను పురస్కరించుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్. మానకొండూరులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఆర్ఎంపీ, పీఎంపీలతో "చాయ్ పే చర్చ" కార్యక్రమాన్ని నిర్వహించారు. మోదీ 12 ఏళ్ల పాలనలో సాధించిన విజయాలను, ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. సమాజంలో అట్టడుగునున్న చిట్ట చివరి వ్యక్తికి సైతం సంక్షేమ ఫలాలు అందించడమే బీజేపీ సిద్ధాంతమని, తూ.చ తప్పకుండా అమలు చేస్తున్న మహనీయుడు మోదీ అని కొనియాడారు. మోదీ పాలనా విజయాలను వివరించడంతోపాటు ప్రజలకు మరింత మేలు చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై అవసరమైన సలహాలు సూచనలు తీసుకునేందుకు "చాయ్ పే చర్చ" వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు.



## పట్టపగలే హై మాస్ట్ వెలుగులు

( వరంగల్/ పర్వతగిరి) జూన్ 18, ప్రజాకలం ప్రతినిధి.

పర్వతగిరి మండలంలోని బస్టాండ్ వద్ద ఉన్న హై మాస్ట్ వీధి దీపాలు నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. సంబంధిత అధికారులు, పాలకులు వాటి నిర్వహణను పట్టించుకోవడం లేదు. దీంతో విద్యుత్ బిల్లు గ్రామ పంచాయతీకి భారంగా మారుతోంది. పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్న ఎవరూ కూడా అటు వైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పాలకులు స్పందించి వెంటనే హై మాస్ట్ వీధి దీపాలకు స్వీచ్ ఆన్, ఆఫ్ ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.



## ఎడ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉచిత పుస్తకాల పంపిణీ




మల్హర్, జూన్ 18 ప్రజాకలం ప్రతినిధి మండలంలోని ఎడ్లపల్లి గ్రామంలో స్థానిక ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు మరియు నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ జంగిడి శ్రీనివాస్ చేతుల మీదుగా విద్యార్థులకు ఈ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మాట్లాడుతూ.. విద్యార్థుల విద్యాభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న సర్పంచ్ కు పాఠశాల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

### గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీనివాస్

## కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

( వరంగల్/ పర్వతగిరి) జూన్ 18, ప్రజాకలం ప్రతినిధి.

పర్వతగిరి మండలం దౌలత్ నగర్ గ్రామంలో దొనికెన శ్రీనివాస్ తాడిచెట్టు ఎక్కి దిగుతుండగా ప్రమాదవశాత్తు చనిపోవడం జరిగింది. వారి కుటుంబాన్ని గౌడ సంఘం మండల అధ్యక్షుడు రంగు జనార్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం శ్రీనివాస్ కుటుంబానికి 25 వేల రూపాయల ఆర్థిక సాయం అందించి ఆ కుటుంబానికి అండగా ఉంటామని తెలపడం జరిగింది. కుటుంబానికి అన్ని విధాల గౌడ సంఘం అండగా ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గీత బందు సేవాసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, గోప రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్ గౌడ్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోనగాని యాదగిరి గౌడ్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఏరుగొండ సంపత్ గౌడ్, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎక్స్ ఎంపీపీ రంగు కుమార్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు పుల్లూరి సారయ్య గౌడ్, ఉపాధ్యక్షులు రంగు వెంకన్న గౌడ్, గౌడ సంఘం సీనియర్ నాయకులు బత్తిని సాంబయ్య గౌడ్ తదితరులు ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం ద్వారా రావలసిన ఎక్స్‌గ్రేషియా అతి త్వరలో ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.



## కొయ్యూరులో ఇందిరమ్మ ఇండ్ల పనుల శ్రీకారం

మల్హర్, జూన్ 18 ప్రజాకలం ప్రతినిధి...

మల్హర్ రావు మండలం కొయ్యూరు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల స్థలాలలో ముగ్గు పోసే కార్యక్రమం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.కొయ్యూరు సర్పంచ్, మల్హర్ రావు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు కొండ రాజమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారుల ఇండ్ల స్థలాలను పరిశీలించి, ముగ్గులు వేసి పనులను అధికారికంగా ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు అయిత రాజిరెడ్డి, ఎడ్లపెల్లి సర్పంచ్ జంగిడి శ్రీనివాస్, ఎంపీడీవో క్రాంతి కుమార్, ఏఈ రంజిత్, పంచాయతీ కార్యదర్శి రాజు పాల్గొని లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లకావత్ సవేందర్, మూడో వార్డు సభ్యురాలు వేల్పుల సారమ్మ, ఇందిరమ్మ కమిటీ సభ్యురాలు అరివేండి పద్మ, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పోతిరెడ్డి మహేందర్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు లకవత్ రాజేందర్, యూత్ ఉపాధ్యక్షుడు బిస్కుల అశోక్, బూత్ అధ్యక్షుడు వేల్పుల మహేందర్, గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి వేల్పుల వెంకటేష్, మండల మహిళా జనరల్ సెక్రటరీ తెప్పల రజిత, మాజీ ఉప్ప సర్పంచ్ కొండూరు మమత, సీనియర్ నాయకులు బొమ్మ మల్లారెడ్డి, అంగోత్ రవీందర్, కుంభం బాపురెడ్డి, పేరుమండ్ల మల్లేష్, పర్వతాల లచ్చన్న, వేమునూరి రామక్క, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ

**యాదాద్రి భువనగిరి జూన్ 18 ప్రజాకలం:**

యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో గురువారం రోజున హలో ఉప సర్పంచ్ చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా నాయకులు ఆవిష్కరించారు. ఈ నెల 25న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్‌ల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు



ఉప సర్పంచ్‌ల సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప సర్పంచ్‌లకు తగిన అధికారాలు, గౌరవ వేతనం, సంక్షేమ పథకాలు, బీమా సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ఉప సర్పంచ్‌ల పాత్ర ఎంతో కీలకమైనప్పటికీ, వారికి తగిన గుర్తింపు, అధికారాలు లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఉప సర్పంచ్‌ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలోని ఉప సర్పంచ్‌లందరు ఈ నెల 25న ఇందిరాపార్క్‌లో జరిగే ధర్నాకు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సురగంటి శ్రీధర్ రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాసాల లింగస్వామి యాదవ్, రాష్ట్ర కమిటీ సభ్యులు మజ్జిగ నరేష్, చిన్నం బాలరాజు, మండల ఫోరా అధ్యక్షులు వెంకటేష్, నాయక్, సత్యం, కిషోర్, వివిధ గ్రామాల ఉపసర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

# బడిబాటకు పుస్తకాల తోడు

**- ప్రభుత్వ పాఠశాలలో**

**విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ.**

వేములవాడ, జూన్ 18 :( ప్రజా కలం ప్రతినిధి): విద్యార్థులు విద్యాభ్యాసంలో ముందంజలో నిలవాలని, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక 7, 8 వార్డుల కౌన్సిలర్లు ఎలా శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపురం ప్రభుత్వ పాఠశాలలో గురువారం వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు.



విద్యార్థులు పాఠ్యపుస్తకాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యతోనే మంచి భవిష్యత్తు నిర్మించుకోవచ్చని అన్నారు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లల చదువులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ప్రభుత్వ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అమరేశ్వరి, నరసింహారావు, ఉపాధ్యాయులు శ్రీనివాస్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు సయ్యద్ సాబీర్, నాగుల విష్ణు, పాఠశాల విద్యార్థులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వేధింపులకు చెక్..

**మహిళలకు షీ టీమ్ అండ**

**- పని ప్రదేశాల్లో భద్రతపై ప్రత్యేక అవగాహన.**

రాజన్న సిరిసిల్ల, జూన్ 18 ( ప్రజా కలం ప్రతినిధి): మహిళలు ఎలాంటి వేధింపులు, ఇబ్బందులు ఎదుర్కొన్నా భయపడకుండా నిర్భయంగా ఫిర్యాదు చేయాలని జిల్లా షీ టీమ్ సూచించింది. మహిళల భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో మహిళలు పని చేసే ప్రదేశాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా మహిళలపై జరిగే లైంగిక వేధింపుల నివారణ, పని ప్రదేశాల్లో భద్రతా చర్యలు, మహిళలకు సంబంధించిన చట్టాలు, వారి హక్కులపై సమగ్ర అవగాహన కల్పిస్తున్నారు. గురువారం గంబీరావుపేట మండలంలోని ముచ్చెర్ల, లింగన్నపేట గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు హాజరయ్యే మహిళలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ అధికారులు మాట్లాడుతూ మహిళలు ఎలాంటి వేధింపులకు గురైనా వెంటనే జిల్లా షీ టీమ్ హెల్ప్‌లైన్ నంబర్ 87126 56425కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులతో చాటింగ్ చేయడం, వ్యక్తిగత సమాచారం, ఫోటోలు, ఇతర వివరాలను పంచుకోవడం వల్ల మోసాలకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మహిళలు తమ భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండి అవసరమైతే వెంటనే పోలీసుల సహాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐలు ప్రమీల, రవి, సిబ్బంది శ్రీనివాస్, ప్రియాంక, శ్రీలత పాల్గొన్నారు.




# క్యాన్సర్ వైద్యంలో యశోద ఆసుపత్రిలో నూతన విప్లవం

**- దేశంలోనే మొదటిసారిగా యశోద ఆసుపత్రిలో "హైపర్ సైట్" చికిత్స అందుబాటులోకి**

**- ప్రపంచ స్థాయి సాంకేతికతతో క్యాన్సర్ చికిత్స - క్యాన్సర్ నిపుణులు డాక్టర్ టీ. స్రవంతి**

యాదాద్రి భువనగిరి:
జూన్ 18 ప్రజా కలం ప్రతినిధి :

దేశంలోనే వైద్య సేవల్లో సరికొత్త రికార్డులను సృష్టిస్తున్న సికింద్రాబాద్ లోని ప్రముఖ యశోద ఆసుపత్రి క్యాన్సర్ రోగుల పాలిట వరంగా మారింది. ప్రపంచ స్థాయి నాణ్యమైన చికిత్సను సామాన్యులకు సైతం అందుబాటులోకి తెస్తూ, క్యాన్సర్ వైద్యంలో సరికొత్త విప్లవానికి తెరలేపింది. భారతదేశంలోనే మొట్ట మొదటిసారిగా అత్యంత అధునాతనమైన "హైపర్ సైట్" రేడియేషన్ టెక్నాలజీని యశోద ఆసుపత్రి ప్రవేశపెట్టింది.



ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని స్థానిక సంకల్ప హోటల్ లో గురువారం క్యాన్సర్ నిపుణులు యశోద ఆసుపత్రి డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధి తీసుకోవాల్సిన జాగ్రత్తలు నివారణ ప్రపంచస్థాయిలో క్యాన్సర్ పై వస్తున్న మార్పులు చికిత్స అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భం గా డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ దేశంలోనే క్యాన్సర్ వ్యాధిపై నివారణకు ''హైపర్ సైట్'' సాంకేతికతో యశోద ఆసుపత్రిలో అందుబాటులోకి రావడం ఒక విప్లవం అన్నారు. ఈ నూతన సాంకేతికత ద్వారా వివిధ రకాల క్యాన్సర్లకు అత్యంత ఖచ్చితత్వంతో కూడిన చికిత్స అందించడం సాధ్యమవుతుందని ప్రముఖ క్యాన్సర్ నిపుణులు డాక్టర్ స్రవంతి తెలిపారు. సాధారణంగా క్యాన్సర్ అనగానే ప్రజల్లో తీవ్రమైన భయాందోళనలు నెలకొంటాయని, అయితే సరైన సమయంలో వ్యాధిని గుర్తిస్తే సంపూర్ణంగా నయం చేయవచ్చని డాక్టర్ స్రవంతి పేర్కొన్నారు. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన "హైపర్ సైట్" టెక్నాలజీ ద్వారా క్యాన్సర్ కణితుల (టూమర్స్) పరిమాణాన్ని, అవి ఉన్న స్థానాన్ని సెకన్ల వ్యవధిలో, అత్యంత స్పష్టమైన ఇమేజింగ్ ద్వారా స్క్రీన్‌పై చూడవచ్చని వివరించారు. దీనివల్ల కణితి చుట్టూ ఉండే ఆరోగ్యకరమైన అవయవాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా, కేవలం క్యాన్సర్ కణాలపై మాత్రమే రేడియేషన్ ప్రభావం పడేలా ఖచ్చితమైన చికిత్స అందించవచ్చు.

బ్రెస్ట్ క్యాన్సర్, లంగ్ క్యాన్సర్, ప్రొస్టేట్, గ్యాస్ట్రోఇంటెస్టినల్ మరియు తల-మెడ భాగాలలో వచ్చే వివిధ రకాల క్యాన్సర్లకు ఈ విధానం అద్భుతంగా పనిచేస్తుందని ఆమె అన్నారు. ఈ సరికొత్త చికిత్సా విధానం వల్ల రోగులు ఆసుపత్రిలో గడపాల్సిన సమయం చాలా వరకు తగ్గుతుందని, రేడియేషన్ దుష్ప్రభావాలు సైడ్ ఎఫెక్ట్స్ కూడా తక్కువగా ఉంటాయని డాక్టర్ స్రవంతి స్పష్టం చేశారు. క్యాన్సర్ పట్ల సమాజంలో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని, లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలు, అత్యాధునిక మౌలిక వసతులు కలిగిన యశోద ఆసుపత్రిలో ఈ "హైపర్ సైట్" టెక్నాలజీ అందుబాటులోకి రావడం దేశీయ వైద్య రంగంలో ఒక మైలురాయిగా నిలిచిందని తెలిపారు. ఎలాంటి సంక్లిష్టమైన క్యాన్సర్ రకాలకైనా ఇక్కడ అంతర్జాతీయ స్థాయి చికిత్స లభిస్తుందని, రోగులు ధైర్యంగా ఉండి వ్యాధిపై పోరాడి క్యాన్సర్ పై విజయం సాధించాలని డాక్టర్ స్రవంతి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ యం. వెంకట్ , జనరల్ మేనేజర్ కే,సుదర్శన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అభయతో ఆటో ప్రయాణం సేఫ్

**- 100 ఆటోలకు క్యూ ఆర్ కోడ్‌లు.. డ్రైవర్లకు ప్రమాద భీమా పత్రాలు**

**-ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి.. ఓవర్‌లోడ్ వద్దు. - ఎస్పీ మహేష్ బి.గితే.**



రాజన్న సిరిసిల్ల, జూన్ 18 (ప్రజాకలం ప్రతినిధి): ప్రయాణికుల భద్రతకు మరింత భరోసా కల్పించే లక్ష్యంతో జిల్లా పోలీసు శాఖ చేపట్టిన 'అభయ యాప్ (వై ఆటో ఈజ్ సేఫ్)' ఫేజ్-3 కార్యక్రమంలో భాగంగా 100 ఆటోలకు క్యూ ఆర్ కోడ్‌లను అనుసంధానం చేసి, ఆటో డ్రైవర్లకు ప్రమాద భీమా పత్రాలను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే గురువారం అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ ప్రయాణికులు ఆటోలో సురక్షితంగా ప్రయాణిస్తున్నామనే నమ్మకం కలిగేలా డ్రైవర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అభయ యాప్ ద్వారా ఆటోలకు ప్రత్యేక క్యూ ఆర్ కోడ్‌లను జత చేయడం వల్ల ప్రయాణికులు వాహనం, డ్రైవర్‌కు సంబంధించిన వివరాలను సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆటోలో ప్రదర్శించిన క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే డ్రైవర్ ఫొటో, ఫోన్ నంబర్, వాహన వివరాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో ఎమర్జెన్సీ కాల్ లేదా ఫిర్యాదు చేస్తే వాహనం లైవ్ లొకేషన్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు చేరి, సమీపంలోని పోలీసులు వెంటనే స్పందించి రక్షణ చర్యలు చేపడతారని వివరించారు. మహిళలు, ఇతర ప్రయాణికులు ఆటో ఎక్కే ముందు తప్పనిసరిగా క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకోవాలని సూచించారు. ర్యాష్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, అసభ్య ప్రవర్తన, హిట్ అండ్ రన్ ఘటనలు, ఆటోలో మరిచిపోయిన వస్తువులపై కూడా యాప్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం ఉందన్నారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని హెచ్చరించారు. రోడ్డు భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఆటో డ్రైవర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అభయ యాప్‌తో అనుసంధానమైన వాహనాల డ్రైవర్లకు కేవలం రూ. 50తో ప్రమాద మరణ భీమా కింద రూ. 1 లక్ష బీమా సౌకర్యం కల్పిస్తున్నామని ఎస్పీ తెలిపారు. ప్రతి ఏడాది రూ. 50 చెల్లించి దీనిని పునరుద్ధరించుకోవచ్చన్నారు. ప్రమాద భీమా ద్వారా డ్రైవర్లు, వారి కుటుంబాలకు భద్రత కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సురేష్, ఆర్ఎస్ఐ శ్రీనివాస్, ఎస్ఐ శ్రీనివాస్, అభిచరణ్‌తో పాటు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# పచ్చదనం పెంపు పర్యావరణ పరిరక్షణ.

**- జహీరాబాద్ త్రివేణివనం- ఎకో పార్కును వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**- పాల్గొన్న జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్, టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి**

సంగారెడ్డి ప్రతినిధి జూన్ 18 (ప్రజా కలం):

జహీరాబాద్ పట్టణ శివారులో జాతీయ రహదారి పక్కన అటవీ శాఖ ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న త్రివేణివనం- ఫారెస్ట్ ఎకో పార్కును రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం హైద్రాబాద్ నుండి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ మాట్లాడుతూ పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పచ్చని వాతావరణం నెలకొల్పాలనే లక్ష్యంతో వనమహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 11 ఎకో పార్కులను ముఖ్యమంత్రి వర్చువల్‌గా ప్రారంభించడం సంతోషకరమన్నారు. జహీరాబాద్ ప్రాంతం నిమ్జ్ ద్వారా పారిశ్రామిక స్మార్ట్ సిటీగా రూపుదిద్దు కుంటోందని, భారీ పరిశ్రమలు రావడంతో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. జాతీయ రహదారి పక్కనే 208 ఎకరాల విస్తీర్ణంలో త్రివేణివనం అటవీ ఎకో పార్కును అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కులో ఉన్న అన్ని సౌకర్యాలు త్రివేణివనంలో కల్పించినట్లు చెప్పారు. టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. మానవాళికి ప్రాణవాయువును అందించే చెట్లు, అడవులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చెట్లను నాటి వాటిని సంరక్షించే అలవాటు చేసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జాతీయ రహదారి పక్కనే ఉన్న త్రివేణివనం- ఫారెస్ట్ ఎకో పార్కు ఎంతో ఆకర్షణీయంగా అభివృద్ధి చేయబడిందన్నారు. పార్కులో సైక్లింగ్ వంటి ప్రత్యేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు అధిక సంఖ్యలో సందర్శించి పార్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇదే స్ఫూర్తితో వనమహోత్సవంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. అనంతరం అటవీ శాఖ రూపొందించిన వనమహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పిమ్మట సఫారీ వాహనంలో ఎకో పార్కును సందర్శించి వివిధ సౌకర్యాలను పరిశీలించదంతో పాటు మొక్కలు నాటారు. అనంతరం జెండా ఊపి సైక్లింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, మున్సిపల్ చైర్మన్ యూనిస్, ఉజ్వల్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, జిల్లా అటవీ అధికారి ప్రసాద్ రెడ్డి, నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, అటవీ శాఖ అధికారులు, పోలీసు అధికారులు, మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# జర్నలిస్టుల పిల్లలకు ఫ్రీ ఎడ్యుకేషన్: డీఈఓ రోహిణి.

సంగారెడ్డి ప్రతినిధి జూన్ 18(ప్రజా కలం):

2026–27 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్యను అందించాలని జిల్లా విద్యాధికారి ఆర్. రోహిణి ఆదేశాలు జారీ చేశారు. వివిధ జర్నలిస్టు సంఘాల వినతి మేరకు ఆర్.సీ. 1877/డీ1/2026, ఈనెల 16వ తేదీన జారీ చేసిన ఉత్తర్వులను సంగారెడ్డి జిల్లాలోని అన్ని మండలాల ఎంఈఓలకు, జర్నలిస్టు సంఘాల నాయకులకు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు పంపించారు. ఈ సందర్భంగా డీఈఓ రోహిణి మాట్లాడుతూ.. "సమాజ హితం కోసం నిరంతరం శ్రమించే జర్నలిస్టుల సేవలు అమూల్యమైనవి. వారి పిల్లలకు నాణ్యమైన విద్య అందాలన్నదే మా లక్ష్యం. పాఠశాలల యాజమాన్యాలు సహృదయంతో సహకరించాలి. ఉచిత విద్య కల్పనలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే సంబంధిత మండల విద్యాధికారులను సంప్రదించవచ్చు. ఇది జర్నలిస్టు సమాజానికి అందించే ప్రోత్సాహం" అని పేర్కొన్నారు.

## లక్ష్మీ ఫౌండేషన్ చైర్మన్ మర్కంటి కనకయ్య ముదిరాజ్‌కు ఘన సన్మానం

### - సేవా కార్యక్రమాల్లో ఆయన పాత్ర అభినందనీయం: ప్రతాప్ రెడ్డి

గజ్వేల్: 18 జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు,లక్ష్మీ ఫౌండేషన్ చైర్మన్ మర్కంటి కనకయ్య ముదిరాజ్ జన్మదినం



సందర్భంగా గురువారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి,ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో మర్కంటి కనకయ్య ముదిరాజ్‌కు శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ,మర్కంటి కనకయ్య ముదిరాజ్ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. లక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉండటంతో పాటు అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి పుట్టినరోజు వేడుకలను మరెన్నో జరుపుకోవాలని,భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

# పెన్నార్ పోరు.. చుక్క గుర్తుపై గురి..

### -పెన్నార్ పోరులో చుక్క గుర్తుకే కార్మికుల మద్దతు కోరిన కాట..

పటాన్‌చెరు, జూన్ 18 (ప్రజా కలం) ప్రతినిధి

పెన్నార్ పరిశ్రమలో ఈ నెల 20న జరగనున్న కార్మిక సంఘం ఎన్నికలు ఉత్కంఠ రేపుతున్నాయి. కార్మికుల హక్కులు, సంక్షేమం, మెరుగైన వేతన ఒప్పందాలే ప్రధాన అజెండాగా ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో బండ్లగూడ గ్రామంలోని పెన్నార్ పరిశ్రమ వద్ద నిర్వహించిన గేట్ సమావేశంలో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ పాల్గొని కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. పెన్నార్ కార్మికుల భవిష్యత్తు కోసం చుక్క గుర్తుకు ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ కూటమి నిరంతరం పోరాడుతోందని తెలిపారు. కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా, వారికి అనుకూలంగా మెరుగైన వేతన ఒప్పందం కుదిరేలా ప్రత్యేక కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్మికుల ఐక్యతే వారి అసలైన బలమని, కార్మిక సంక్షేమం కోసం పోరాడే నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎన్నికల్లో చుక్క గుర్తుకు ఓటు వేసి కార్మికుల గొంతుకను మరింత బలపరచాలని విజ్ఞప్తి చేశారు..



# రైతులు యూరియా యాప్ ద్వారానే బుక్ చేసుకోవాలి

### యూరియా కోసం రైతులు భారీ క్యూ లైన్లు కట్టవలసిన అవసరం లేదు - జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ జూన్ 18(ప్రజాకలం ప్రతినిధి)రైతులు యూరియా యాప్ ద్వారానే బుక్ చేసుకోవాలని, జిల్లాలో యూరియా కొరత లేదని, ప్రస్తుతం 6300 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో కలదని రైతులు యూరియా విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. మెదక్ జిల్లాలో యూరియా సరఫరా విషయంపై కలెక్టర్ మాట్లాడుతూ యూరియా కోసం యాప్ రూపొందించడం జరిగిందని రైతులు ఇంటి వద్ద నుంచే యూరియాను బుక్ చేసుకుని సమయానికి అనుగుణంగా డీలర్స్ దగ్గరకు వెళ్లి అవసరానికి అనుగుణంగా యూరియా తీసుకువచ్చన్నారు.

యూరియా కోసం రైతులు భారీ క్యూ లైన్లు కట్టవలసిన అవసరం లేదని ప్రస్తుతం జిల్లాలో ప్రైవేట్ డీలర్స్, మార్క్ ఫెడ్ లో 6,300 మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టార్ట్ కలదనీ ప్రతి మండలంలో రెండు మూడు డీలర్ పాయింట్లు వద్ద యూరియా స్టాక్ అందుబాటులో ఉంచుతున్నాం అని వివరించారు. రైతులు సమన్వయం పాటిస్తూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉండేలా రైతు సేవ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఐకేపీ రైతు సేవా కేంద్రంలో విక్రయించే ఎరువులు, విత్తనాలు, పురుగుమందులకు సంబంధించిన లైసెన్సులను దుకాణంలో స్పష్టంగా కనిపించే విధంగా భద్రంగా ప్రదర్శించాలని ఆదేశించారు. రైతులు కొనుగోలు చేసే వ్యవసాయ ఇన్‌పుట్‌లపై పూర్తి సమాచారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. రైతులకు ఎలాంటి నష్టాలు కలగకుండా నాణ్యమైన విత్తనాలు, ప్రమాణాలకు అనుగుణమైన ఎరువులు, పురుగుమందులను మాత్రమే విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. నకిలీ (లేదా) నాసిరకం ఉత్పత్తులకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రైతుల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సేవలు అందించాలన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధిలో రైతు సేవా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, రైతులకు నాణ్యమైన సేవలు అందించడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకత పెంపునకు తోడ్పడాలని కలెక్టర్ సూచించారు.



# భక్తి వెలుగుల్లో తెల్లాపూర్..

### -తెల్లాపూర్‌లో భక్తి వెల్లువ..
### - నవగ్రహ ప్రతిష్ఠ ఘనం..
### - ఆధ్యాత్మికతపై నీలం మధు..
### - వైభవంగా పూర్ణాహుతి..



పటాన్‌చెరు, జూన్ 18 (ప్రజా కలం) ప్రతినిధి

తెల్లాపూర్‌లో భక్తి వెల్లువ.. నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవం..తెల్లాపూర్ జ్యోతిరావు పూలే కాలనీలోని శ్రీ విజయదుర్గా పెద్దమ్మ తల్లి ఆలయంలో నిర్వహించిన శ్రీ శివ పంచాయతన సహిత నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం భక్తుల నడుమ ఘనంగా ముగిసింది. మూడు రోజుల పాటు వేద మంత్రోచ్చారణలతో సాగిన ఈ ఆధ్యాత్మిక వేడుకలు ప్రాంతంలో భక్తి వాతావరణాన్ని నెలకొల్పాయి. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ముగింపు కార్యక్రమానికి మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ సభ్యుడు నీలం మధు ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో సానుకూల వాతావరణాన్ని పెంపొందిస్తాయని, భక్తి భావన మానసిక ప్రశాంతతకు దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. జూన్ 16 నుంచి 18 వరకు వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామాల్లో ఇటువంటి దైవ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజలకు ఆయురారోగ్యాలు, శాంతి, శ్రేయస్సు కలుగుతాయని నీలం మధు ఆకాంక్షించారు..ఈ మహోత్సవాన్ని విజయవంతం చేసిన కొల్లూరి అమృత సత్యయ్య దంపతులు, కొల్లూరి భరత్, ఆలయ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. రాష్ట్ర ప్రజలందరిపై భగవంతుని కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో చిన్న శ్రీశైలం యాదవ్, పుష్ప నాగేష్ యాదవ్, ప్రభాకర్ రెడ్డి, డాకూర్ రామ్ మోహన్ రెడ్డి, లింగం, మధుసూదన్, రవి చారి, పాండు, బాబు గౌడ్, ఐలేష్ యాదవ్, ధరణి రాజు, రాజేష్, లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు..

## ఘనంగా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి జన్మదిన వేడుకలు



గజ్వేల్: 18 జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్.సి రాజమౌళి జన్మదినం పురస్కరించుకొని గురువారం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి నిరాడంబరంగా జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. కాగా వారి అభిమానులు దేవాలయాల్లో పూజలు పేదలకు పండ్లు పంపిణీ ఇలాంటి విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ సి రాజమౌళి మాట్లాడుతూ నా జన్మదినం సందర్భంగా ప్రత్యక్షంగా పరోక్షంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అందరికీ ధన్యవాదాలు తెలుపుతూ నిరంతరం ప్రజాసేవలో ముందు ఉంటానని తెలిపారు,

అనంతరం బిఆర్ఎస్ యూత్ వింగ్ నాయకుడు ఎన్ సి సంతోష్ మాట్లాడుతూ మా నాన్న రాజమౌళి జన్మదినం పురస్కరించుకొని అందరూ ప్రేమాభిమానులతో జన్మదిన వేడుకలు నిర్వహించిన వారికి అలాగే ప్రత్యక్షంగా పరోక్షంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ సి రాజమౌళి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# పటాన్‌చెరులో భక్తి నిర్మాణాలు..

### -సొంత నిధులతో ఆలయాల నిర్మాణం..-భక్తి భావం పెంచుతున్న మహిపాల్‌రెడ్డి..

పటాన్‌చెరు, జూన్ 18 (ప్రజా కలం )ప్రతినిధి

పటాన్‌చెరు నియోజకవర్గంలో అభివృద్ధితో పాటు ఆధ్యాత్మికతకు సమాన ప్రాధాన్యం ఇస్తూ ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించే దిశగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మరో ముందడుగు వేశారు. సొంత నిధులతో దేవాలయాల నిర్మాణాలు చేపడుతూ, అన్ని మతాల ప్రార్థనా మందిరాలకు సహకారం అందిస్తూ పరమత సహనానికి అద్దం పడుతున్నారు.

జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని సింఫనీ కాలనీలో గురువారం ఉదయం రామాలయం, శివాలయం, అమ్మవారి దేవాలయాల నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం బండల మల్లన్న దేవాలయం ఆవరణలో చౌడమ్మ దేవాలయం నిర్మాణానికి భూమిపూజ చేసి, వాణిజ్య సముదాయం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ, నూతన దేవాలయాలు, వాణిజ్య సముదాయం నిర్మాణాలకు సొంత నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడమే లక్ష్యంగా నియోజకవర్గ వ్యాప్తంగా దేవాలయాలు, మసీదులు, చర్చిల నిర్మాణాలకు



సహకరిస్తున్నామని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల మధ్య సౌభ్రాతృత్వం, పరమత సహనం పెంపొందించే కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

కార్యక్రమంలో గూడెం మధుసూదన్‌రెడ్డి, యాదగిరి యాదవ్, విజయ్‌కుమార్, కాసాల సుధాకర్, పృథ్వీరాజ్, చంద్రశేఖర్, మల్లేష్ యాదవ్, విజయ్, వెంకటేష్, ధనరాజ్ గౌడ్, రాజు, నాగమల్లేష్ తదితరులు పాల్గొన్నారు..

# భక్తి బాటలో పటాన్‌చెరు..

### -పటాన్‌చెరులో భక్తి--అభివృద్ధి బాట..
### -ఆలయాల నిర్మాణానికి భూమిపూజ..

పటాన్‌చెరు, జూన్ 18 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్‌చెరు నియోజకవర్గంలో అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక వాతావరణాన్ని బలోపేతం చేసే కార్యక్రమాలు వేగం పుంజుకున్నాయి. ప్రజల



ఆధ్యాత్మిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆలయాల నిర్మాణానికి చేపడుతున్న చర్యలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని సింఫనీ కాలనీలో రామాలయం, శివాలయం, అమ్మవారి ఆలయాల నిర్మాణాలకు, బండల మల్లన్న దేవాలయ ఆవరణలో చౌడమ్మ ఆలయం, వాణిజ్య సముదాయం నిర్మాణ పనులకు నిర్వహించిన భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమాల్లో మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సొంత నిధులతో ఆలయాల అభివృద్ధికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రజా సంక్షేమంతో పాటు ఆధ్యాత్మిక విలువలను పరిరక్షించే దిశగా చేపడుతున్న కార్యక్రమాలు సమాజానికి మేలు చేస్తాయని పేర్కొన్నారు. కుల, మత భేదాలకు అతీతంగా దేవాలయాలు, మసీదులు, చర్చిల నిర్మాణాలకు సహకరిస్తూ సామరస్య సమాజ నిర్మాణానికి కృషి చేయడం విశేషమన్నారు. భక్తి, సేవ, సామరస్యం కలిసినప్పుడే సమాజం మరింత బలోపేతం అవుతుందని, పటాన్‌చెరు అభివృద్ధి ప్రస్థానంలో ఆధ్యాత్మిక విలువలకు కూడా సమాన ప్రాధాన్యం లభించడం సంతోషకరమని తెలిపారు..

## బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు

మెదక్ జూన్ 18(ప్రజాకలం ప్రతినిధి) మెదక్ జిల్లా మెదక్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ఉదయం 5 గంటలకు ఎలాంటి కారణం చెప్పకుండా అరెస్ట్ చేసి మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్ కు తరలించారని,కారణాలు తెలపడం లేదు అని మెదక్ పట్టణ కన్వీనర్ కౌన్సిలర్



మామిళ్ల ఆంజనేయులు తెలిపారు. అరెస్టును ఆయన ఖండించారు. అరెస్ట్ అయినవారిలో మెదక్ మున్సిపల్ కౌన్సిలర్లు బట్టి ఉదయ్ కుమార్, దీపక్ కుమార్, జుబేర్ అహ్మద్, మాజీ కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, మాయ మల్లేశం, సాయి, కృష్ణాగౌడ్, ఇంద్రాన్ తదితరులు ఉన్నారు.

## భవనాల నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి రాష్ట్ర ప్రత్యేక అధికారి విజయరామరావు

మెదక్ జూన్ 18(ప్రజాకలం ప్రతినిధి)సంక్షేమ భవనాల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని రాష్ట్ర ప్రత్యేక అధికారి విజయరామరావు తెలిపారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సంక్షేమ భవనాల నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని రాష్ట్ర ప్రత్యేక అధికారి



విజయరామరావు పేర్కొన్నారు. గురువారం ఆయన కౌడిపల్లి గ్రామ పంచాయతీకి సంబంధించి నిర్మాణంలో ఉన్న మహిళా సమాఖ్య భవనం పనులను, అలాగే త్వరలో నిర్మాణం చేపట్టనున్న మహిళా సమాఖ్య భవనం--2, అంగన్‌వాడీ భవనాల నిర్మాణ స్థలాలను జగిత్యాల, మెదక్ జిల్లాల ప్రత్యేక అధికారి శ్రీ విజయరావు సందర్శించి పరిశీలించారు.

# ప్రభుత్వ స్కూల్ ప్రైవేట్ స్కూల్ దీటుగా ఇంగ్లీష్ బోధించాలి

## - అంగన్వాడిలో పిల్లలందరికీ పోషకాహారం అందించాలి

## - మహేశ్వరం గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్

మహేశ్వరం, జూన్ 18, (ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం గంగారం గ్రామ పంచాయతీ పరిధిలోని గంగారం తండాలో అంగన్వాడి కేంద్రంలో అమ్మబాట అంగన్వాడి బాట స్కూల్



బాట మన అంగన్వాడిలో పిల్లలందరికీ పోషకాహార అందియాలని గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ తెలియజేశారు. పిల్లలకు ప్రేమగా జాగ్రత్తగా చూసుకునే బాధ్యత అంగన్వాడి ఆయమ్మ చూసుకోవాలి ఆటపాటలతో కథలు సాంస్కృతి ప్రకృతి సందర్శించిన ప్రత్యక్ష అనుభవాలు చదవడానికి రాయడానికి నైపుణ్యాలకు జాగ్రత్తగా బోధించాలి తెలంగాణ గవర్నమెంట్ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ స్కూల్ ప్రైవేట్ స్కూల్ దీటుగా ఇంగ్లీష్ బోధించాలని టీచర్లకు తెలియజేయడం జరిగింది . అదేవిధంగా స్కూల్లో అన్నా ప్రసాదం తినిపించడం జరిగింది స్కూల్లో పుస్తకాలు నోట్ బుక్స్ లు పెన్నులు పెన్సిల్ అందించడం జరిగింది . ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ ఉప సర్పంచ్ మహేందర్ వార్డ్ మెంబర్స్ ఎం రవి ఏం మోహన్ ఏం దేవా ఏం గోపి ఏం ధర్మ ఏం శ్రీనివాస్ స్కూల్ టీచర్ శ్రీధర్ అంగన్వాడీ ఆయమ్మ రూప తదితరులు పాల్గొన్నారు.

# కాలనీల సమస్యలను త్వరగా పరిష్కరించాలి

## ఏఐసీసీ-విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి

మహేశ్వరం,జూన్ 18,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం నాదర్గుల్ డివిజన్ - 57 అల్మాస్‌గూడ, గుర్రంగూడ పరిధిలోని పలు కాలనీల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని





కోరుతూ ఏఐసీసీ-విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ కి, సూపరింటెండింగ్ ఇంజనీర్ డి. కిష్టప్ప కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక హిల్స్, మారుతీ నగర్, అరవింద్ నగర్ కాలనీలలో రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల సమస్యల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కోరారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందిస్తూ, క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు లింగం యాదవ్, రమాదేవి, వెంకట నారాయణ, రూప, నారియా నాయక్, నారాయణ రావు, కనకా చారి, మల్లేష్, హరి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ప్రాణాలతో అధికారులు చెలగాటం

## జల్‌పల్లి పరాడి షరీఫ్ డివిజన్‌లో నెల రోజులుగా పొంగిపొర్లుతున్న డ్రైనేజీ నీరు

## జిహెచ్ఎంసి అధికారుల లక్ష్యానికి నిదర్శనం

మహేశ్వరం, జూన్ 18,(ప్రజా కలం)

వాడీ-ఏ-సాలేహీన్ సమీపంలో గత ఒక నెలగా డ్రైనేజీ నీరు రోడ్లపైకి వచ్చి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ఈ సమస్యపై జల్‌పల్లి మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.డ్రైనేజీ నీరు ప్రవహిస్తున్న ప్రాంతానికి సమీపంలో ఒక చిన్న చల్లా ముబారక్ కూడా ఉండటంతో భక్తులు మరియు స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.దుర్వాసన, దోమల పెరుగుదలతో పాటు అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. వెంటనే స్పందించి డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని జల్‌పల్లి మున్సిపల్ అధికారులు సంబంధిత శాఖలను ప్రజలు కోరుతున్నారు.





# బదిలీపై వెళ్తున్న పంచాయతీ సెక్రటరీలకు వీడ్కోలు

## - నూతన సెక్రటరీలకు సన్మానం.

సిద్దిపేట ప్రజాకలం జూన్ 18.

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని వివిధ గ్రామాల్లో విధులు నిర్వహించిన పంచాయతీ సెక్రటరీలు బదిలీపై వెళ్తున్న సందర్భంగా వారికి ఘనంగా వీడ్కోలు పలికారు. అలాగే నూతనంగా విధుల్లో చేరిన పంచాయతీ సెక్రటరీలను సన్మానించి స్వాగతం పలికారు.

రాయపోల్ మండల ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మూతలీఫ్, మండలంలోని అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ, పంచాయతీ సెక్రటరీలు గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. ఎక్కడ విధులు నిర్వహించినా ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేయాలని సూచించారు. బదిలీపై వెళ్తున్న సెక్రటరీలు తమ సేవలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సెక్రటరీలు కూడా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పంచాయతీ సెక్రటరీలు మరియు సిబ్బంది పాల్గొని బదిలీపై వెళ్తున్న వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# రసాయన శాస్త్రంలో జి.సుప్రియకు పీహెచ్.డీ.

పటాన్ చేరు జూన్ 18 (ప్రజా కలం)ప్రతినిధి

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని జి. సుప్రియ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'పర్యావరణ, జీవసంబంధ అనువర్తనాల కోసం హైబ్రిడ్ లోహ నానోకాంపోజిట్ల జీవసంశ్లేషణ'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకులు డాక్టర్ కె. ఫణి రాజా, సహ-పర్యవేక్షకుడు డాక్టర్ పి.వి.నాగేంద్ర కుమార్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు డాక్టర్ కుమారి చేసిన డాక్టరల్ పరిశోధన, ముఖ్యమైన పర్యావరణ, బయోమెడికల్ అనువర్తనాలు కలిగిన అధునాతన మెటల్ నానోకాంపొజిట్ల గ్రీన్ సింథసిస్ పై దృష్టి సారించినట్టు వారు వివరించారు. ఈ అధ్యయనం మెరుగైన ఫోటోకాటలిక్, యాంటీ బాక్టీరియల్, ఎలక్ట్రోకెమికల్, సెన్సింగ్ లక్షణాలను ప్రదర్శించినట్టు తెలిపారు. సుస్థిర సాంకేతిక పరిష్కారాల కోసం పర్యావరణ అనుకూల నానోపదార్థాల సామర్థ్యాన్ని ఇది నొక్కి చెబుతోందన్నారు.డాక్టర్ సుప్రియ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్



సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# మహేశ్వరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభించిన గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్,



మహేశ్వరం, జూన్ 18,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కేంద్రం మహేశ్వరం గ్రామం 1 వ వార్డులో హెచ్ ఎం డి ఎ 10 లక్షల నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ ప్రారంభించారు. తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్, ఉప సర్పంచ్ జోరల రమేష్, శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షులు బంగారుగల్ల లాజర్, మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అల్లే బిక్షపతి, మహేశ్వరం గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు కర్రెల రాములు ముదిరాజ్, 1 వ వార్డు సభ్యులు టి.బేబీ మక్కాజి, 8 వ వార్డు సభ్యులు కాకి పరమేష్ ముదిరాజ్, 10 వ వార్డు సభ్యులు ఆకుల వీరి బాబు, 3 వ వార్డు సభ్యులు ఆవుల కాడి కిష్టమ్మ శ్రీశైలం, శివగంగా ఆలయ కమిటీ డైరెక్టర్ పేయ్యల దేవేందర్, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం మండల సోషల్ మీడియా మాజీ కోఆర్డినేటర్ ఏపూరి నరసింహ, మహేశ్వరం మండల్ యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నడికుడా రాకేష్ ముదిరాజ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు స్వర్ణగంటి ఆకాష్, మహేశ్వరం పట్టణ శాఖ ఉపాధ్యక్షులు దుంపల ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ 2 వ వార్డు ఇంచార్జ్ గదగుటి మహేందర్ ముదిరాజ్,10 వ వార్డు ఇంచార్జ్ కాకి మల్లేష్ ముదిరాజ్, 14 వ వార్డు ఇంచార్జ్ పుట్లగారి చందు, సీనియర్ నాయకులు మహమ్మద్ గౌస్, గ్రామ పెద్దలు వంగూరి మల్లేష్ యాదవ్, స్వర్ణ గంటి శంకరయ్య, పే యాదయ్య, ఖానాపురం రాజు, ముత్యాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు

# వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ కే. హేమావతి.

సిద్దిపేట ప్రజాకలం జూన్ 18.

వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం రంగారెడ్డి జిల్లా గుర్రంగూడ గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి



మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది 16 కోట్ల మొక్కలు నాటే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములై వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని సిద్దిపేట జిల్లాలోని కొండపాక మండలం మర్పడగ తేజోవనం అర్బన్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కే. హేమావతి విద్యార్థులు, పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్, జిల్లా క్రీడాశాఖ అధికారి పద్మజారాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపెల్లి చంద్రం తదితర అధికారులతో కలిసి డిజిటల్ తెరపై వీక్షించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో మొక్కల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా జిల్లాలో 20 లక్షల మొక్కలు నాటేందుకు అటవీ శాఖతో పాటు ఇతర శాఖల సమన్వయంతో నర్సరీలలో మొక్కలను సిద్ధం చేసినట్లు తెలిపారు. మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. జిల్లా ప్రజలందరూ ఈ బృహత్తర వనమహోత్సవ కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతం చేయాలని కలెక్టర్ కే. హేమావతి కోరారు.

# గొర్రెలు, మేకల కొట్టాలతో గ్రామస్తులకు ఇబ్బందులు

## గొర్రెలు, మేకల కొట్టాలను తొలగించాలి

మహేశ్వరం, జూన్ 18: (ప్రజా కలం)

గ్రామం మధ్యలో ఇళ్లకు సమీపంగా ఏర్పాటు చేసిన మేకలు, గొర్రెల కొట్టాల కారణంగా ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని దిలావర్‌గూడ



గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం దిలావర్‌గూడ గ్రామానికి చెందిన పలువురు మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో మేకలు, గొర్రెల పెంపకం అధికంగా ఉండటంతో వాటి కొట్టాలను నివాసాల మధ్య ఏర్పాటు చేశారని గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో కొట్టాల పరిసరాల్లో అపరిశుభ్ర పరిస్థితులు నెలకొని దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. దీంతో డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.సాయంత్రం వేళల్లో దోమల బెడద అధికంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామపంచాయతీ అధికారులు వెంటనే స్పందించి ఇళ్ల మధ్య ఉన్న మేకలు, గొర్రెల కొట్టాలను గ్రామానికి దూరంగా తరలించే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# మహేశ్వరం నియోజకవర్గంలో ఎస్ఐఆర్ అవగాహన సదస్సు

## కేటీఆర్ కార్యక్రమ విజయానికి కార్యాచరణ రూపొందించిన బీఆర్ఎస్ నాయకత్వం మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, జూన్ 18, (ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రకారంగా నిర్వహించనున్న అవగాహన సదస్సు కార్యక్రమానికి సంబంధించి ముఖ్య నాయకుల సమావేశం ఈరోజు ఎమ్మెల్యే గారి క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, మహేశ్వరం



నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొని ఈనెల 27వ తేదీన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి చేపట్టాల్సిన కార్యాచరణపై ముఖ్య నాయకులకు దశ దిశను నిర్దేశించారు. అలాగే ఎస్ఐఆర్ ప్రకారంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, బీఎల్ఏల కార్యాచరణ, సభ నిర్వహణ, ప్రజల సమీకరణ, బాధ్యతల పంపిణీ సమన్వయంపై నాయకులకు మార్గదర్శనం చేశారు. కార్యక్రమ వేదికగా సమయాది రెడ్డి గార్డెన్‌లి వద్ద నిర్వహించనున్న సభ ఏర్పాట్లపై కూడా సమీక్షించి అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పట్లోళ్ల యువకిశోరం కౌశిక్ రెడ్డి , మహేశ్వరం నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 'రైతుల పాలిట శాపంగా మారిన యూరియా యాప్'






**- తక్షణమే యాప్ రద్దుచేసి పాత పద్ధతిలో యూరియా అందించాలి**

**- లేనిపక్షంలో రైతులతో కలిసి ప్రభుత్వాన్ని స్తంభింప చేస్తాం**

**- ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్**

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 18 ప్రజా కలం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్ రైతుల పాలిట శాపంగా మారిందని, తక్షణమే ఆ యాప్ ను రద్దుచేసి పాత పద్ధతిలో రైతులకు యూరియా అందించాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి ప్రభుత్వాన్ని స్తంభింప చేస్తామని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి నియోజకవర్గ కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై రైతులతో కలిసి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి వెన్నెముక రైతు కానీ ఈరోజు అదే రైతును టెక్నాలజీ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇబ్బందుల పాలు చేయడం ఎంతవరకు న్యాయం అని రైతుల పక్షాన ప్రశ్నించారు. యూరియా కొనుగోలుకు ప్రవేశపెట్టిన కొత్త యాప్ విధానం వల్ల సామాన్య రైతులకు ఎన్నో కష్టాలు ఎదురవుతున్నాయి వెంటనే ఈ యాప్ రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్మార్ట్‌ఫోన్లు లేని నిరక్షరాస్యులైన రైతులు పల్లెల్లో ఉండే చాలా మంది వృద్ధులు, చదువుకోని రైతులకు స్మార్ట్ ఫోన్లు వాడటం, యాప్‌లో రిజిస్టర్ చేసుకోవడం తెలియ దని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సరైన ఇంటర్నెట్ సిగ్నల్స్ ఉండవని యాప్ సర్వర్ డౌన్ అయిన ప్రతిసారీ గంటల తరబడి ఎండలో వేచి ఉండాల్సి వస్తోందన్నారు. ?పంటకు యూరియా వేయాల్సిన సరైన సమయంలో యాప్ సమస్యల వల్ల ఆలస్యమైతే, పంట దిగుబడి దెబ్బతింటుందన్నారు.? యాప్ రిజిస్ట్రేషన్ల కోసం ఇంటర్ నెట్ సెంటర్ల చుట్టూ తిరగాల్సి రావడం వల్ల డబ్బు, సమయం వృథా అవుతున్నాయని అన్నారు.

సాంకేతికత అనేది రైతు పనిని సులువు చేయాలి కానీ, వాళ్లను ఇక్కట్ల పాలు చేయకూడదని సూచించారు. గతంలో లాగా ఆధార్ కార్డు లేదా పట్టాదారు పాస్ పుస్తకం చూపిస్తే నేరుగా యూరియా ఇచ్చే పాత పద్ధతినే కొనసాగించాలన్నారు. ఈ సంక్లిష్టమైన యాప్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి రెండు రోజులలో ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని అన్ని సెంటర్ లలో యూరియా అందుబాటులో ఉంచాలని, లేని పక్షాన రైతులను ఏకం చేసి ప్రభుత్వాన్ని స్తంభింపజెస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.




## అక్లూర్ గ్రామంలో ఘనంగా కల్యాణ లక్ష్మి చెక్కు పంపిణీ

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూన్ 18:

వేల్పూర్ మండలంలోని అక్లూర్ గ్రామంలో గురువారం కల్యాణ లక్ష్మి పథకం కింద లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన దొంకంటి లక్ష్మికి కల్యాణ లక్ష్మి చెక్కును అందజేశారు.చెక్కు అందుకున్న అనంతరం లబ్ధిదారు దొంకంటి లక్ష్మి మాట్లాడుతూ.. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక సహాయం అందిస్తూ ఆదుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, ముత్యాల సునీల్ కుమార్ గారికి, మరియు సర్పంచ్ జిన్నా జనార్దన్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ పంపిణీ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మహేష్, ఉప సర్పంచ్ సురేందర్, జిపిఓ పొలాస స్వాతి, మరియు వార్డు మెంబెర్ సురేష్ తదితరులు పాల్గొని లబ్ధిదారుకు శుభాకాంక్షలు తెలిపారు.

---

### బసవ లింగేశ్వర స్వామి కాలనీ

## సమస్యలు వెంటనే పరిష్కరిస్తాం

### మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు

### ప్రతి వార్డ్ బాగుంటేనే మున్సిపల్ అభివృద్ధి

### కమిషనర్ అంజన్ రెడ్డి

భుదాన్ పోచంపల్లి జూన్ 18 ( ప్రజా కలం )

గత 20 సంవత్సరాల నుండి ఎదుర్కొంటున్న బసవ లింగేశ్వర కాలనీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని గురువారం మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, కమిషనర్ అంజన్ రెడ్డికి కాలనీ అధ్యక్షులు కొమ్ము లక్ష్మణ్



ఆధ్వర్యంలో కమిటీ సభ్యులతో వినతిపత్రం అందజేశారు. వారు తెలిపిన వివరాలు మున్సిపల్ పట్టణంలోని బసవ లింగేశ్వర స్వామి కాలనీలో గత 15 సంవత్సరాల నుండి నిర్మించుకున్న ఇండ్లకు ఇప్పటివరకు ఇంటి నెంబర్లు, నల్ల కలెక్షన్లు, విద్యుత్ కనెక్షన్ డ్రైనేజీ రోడ్ల సౌకర్యాలు లేకుండా అడవుల్లో జంతువులుగా మాదిరిగా జీవనం పోరాటం సాగిస్తున్నామని అన్నారు. గతంలో ప్రజా ప్రతినిధులకు, ఉన్నత అధికారులు కలెక్టర్, తాసిల్దార్, మున్సిపల్ కమిషనర్ గతంలో వీరందరికీ మా సమస్యలపై విన్నవించుకున్నాము. అయినా ఇప్పటివరకు మా సమస్య నెరవేరలేదు అని అన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ చైర్మన్, కమిషనర్ మాపై చొరవ తీసుకోవాలని వేడుకున్నారు. వెంటనే వారు స్పందించి ఈ సమస్యలను వెంటనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బసవలింగేశ్వర స్వామి కాలనీ గౌరవ అధ్యక్షులు కర్నాటి పురుషోత్తం, గౌరవ సలహాదారులు లక్ష్మీనారాయణ,జనరల్ సెక్రెటరీ వేముల ఎలేందర్ సహాయకార్యదర్శి గుండు సత్యనారాయణ, డైరెక్టర్లు వెంకటేశం, నరేందర్,స్వామి పాల్గొన్నారు.

## విజ్ఞాన్స్ యూనివర్సిటీకి జాతీయ స్థాయి పేటెంట్ అవార్డు ప్రధానం

### డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వరరావు

భుదాన్ పోచంపల్లి జూన్ 18 ( ప్రజా కలం )

విజ్ఞాన్స్ యూనివర్సిటీకి జాతీయ స్థాయి పేటెంట్ లభించినట్లు విశ్వవిద్యాలయ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వరరావు బుధవారం వెల్లడించారు.యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం, దేశ్‌ముఖిలోని ఉన్న విజ్ఞాన్ యూనివర్సిటీ కి జాతీయస్థాయి పేటెంట్ లభించిందని విశ్వవిద్యాలయ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవి దాసేశ్వరరావు అన్నారు.అపారటస్ ఫర్ కంట్రోల్డ్ మిక్సింగ్ ఆఫ్ కాంక్రీట్ అట్ కన్స్ట్రక్షన్ సైట్స్" అనే అంశంపై విశ్వవిద్యాలయానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హరిశేఖర్ మిట్ట చేసిన పరిశోధనకుగానూ భారత ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం పేటెంట్‌ను మంజూరు చేసినట్లు తెలిపారు.ఈ ప్రతిష్టాత్మక పేటెంట్ సాధించిన పరిశోధక బృందంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ నుంచి డాక్టర్ హరిశేఖర్ ఏకైక ప్రతినిధిగా, సహ–రచయితగా వ్యవహరించి ఈ ఘనత సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిశేఖర్ మిట్ట మాట్లాడుతూ.ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ జాతీయ పేటెంట్ లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తమ పరిశోధనలో భాగంగా నిర్మాణ స్థలాలలో కాంక్రీట్ మిశ్రమాన్ని ఖచ్చితమైన ప్రమాణాలతో నియంత్రించే పరికరాన్ని రూపొందించినట్లు చెప్పారు.జాతీయ స్థాయి పేటెంట్ సాధించి విశ్వవిద్యాలయ కీర్తి ప్రతిష్టలను పెంచిన డాక్టర్ హరిశేఖర్ మిట్టను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిశోర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీఎంవీ రావు, డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు.




# సామాజిక విప్లవ అమరుడుం 'అరె సురేందర్' ఆశయాలు అమరం:

## బౌద్ధ మార్గంలో సేవా కార్యక్రమాలు



నిజామాబాద్,( ప్రజా కలం ప్రతినిధి) జూన్ 18:

అణగారిన వర్గాల హక్కుల కోసం, దళిత, శ్రామిక, గిరిజన సమాజాల అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటం చేసిన సామాజిక విప్లవ వీరుడు, ప్రజా గాయకుడు అరె సురేందర్ అమరుడై 25 సంవత్సరాలు పూర్తయినప్పటికీ, ఆయన ఆశయాలు నేటికీ విద్యార్థి, కార్మిక, సామాజిక రచయితల గుండెల్లో నిరంతరం జ్ఞానదీపాలుగా వెలుగుతూనే ఉన్నాయని ఆయన అభిమానులు, శిష్యులు స్మరించుకున్నారు.ఉమ్మడి జిల్లాల్లో చైతన్య రథసారథినాడు ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాలలో దళిత ఐక్య సంఘటనను ఏర్పాటు చేసి, అణచివేతకు వ్యతిరేకంగా సురేందర్ గారు విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. నాటి పల్లెటూళ్లలో నిరక్షరాస్యతను తరిమికొట్టేందుకు 'రాత్రి బళ్ళు' (నైట్ స్కూల్స్) నిర్వహించడంతో పాటు, యువతలో ఆత్మస్థైర్యం నింపేందుకు కర్రసాము వంటి ఆత్మరక్షణ విద్యలను నేర్పించారు. దళిత సాహిత్యంపై విస్తృత అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వ సారాయి నిషేధ ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు.కార్మిక, గిరిజన హక్కుల పోరాటాలువ్యవసాయ రంగంలో లో–వోల్టేజ్ కారణంగా కాలిపోయిన మోటార్లకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని, శ్రామిక వర్గానికి సరైన వేతనాలు ఇవ్వాలని ఆయన పెద్ద ఎత్తున ఉద్యమించారు. ముఖ్యంగా బీడీ కార్మికులకు నిత్య భత్యం చెల్లించాలంటూ ఎన్నో సంఘటిత కార్యక్రమాలను నడిపించారు. లంబాడి తాండాలపై జరిగిన పోలీస్ దాడులను తీవ్రంగా వ్యతిరేకిస్తూ.. గిరిజనులకు సరైన విద్యుత్, తాగునీరు, పాఠశాలల నిర్మాణం కోసం నిరంతరం పోరాడారు. గిరిజన ప్రాంతాల్లో చైతన్యం నింపేందుకు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాలను స్వయంగా ప్రతిష్టించారు.తుపాకీ గుళ్లకు లొంగని ఆశయంసామాజిక సేవలో అరె సురేందర్ గారు సాధిస్తున్న ప్రజాదరణను ఓర్వలేక నాటి పీపుల్స్ వార్ పార్టీ (మావోయిస్టులు) వారు ఆయన్ను అతి కిరాతకంగా హత్య చేశారు. ఆ దుర్మార్గాన్ని నిరసిస్తూ నాడు ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా సామాజిక శ్రేణులు, కార్మికులు, విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నాడు బుల్లెట్లతో ఆయన్ను భౌతికంగా దూరం చేసినా, ఆయన రగిల్చిన చైతన్య రగిల్రూపాన్ని ఆపలేకపోయారని మేధావులు స్పష్టం చేస్తున్నారు.బాబాసాహెబ్ సిద్ధాంతం – బౌద్ధ మార్గంలో సేవలుసురేందర్ గారి ఆశయాలను సజీవంగా ఉంచుతూ, ఆయన ప్రధాన శిష్య బృందం బాబాసాహెబ్ డా.బి.ఆర్. అంబేద్కర్ సిద్ధాంతాలను కొనసాగిస్తూ సామాజిక బౌద్ధాన్ని స్వీకరించింది. ఇందులో భాగంగా తథాగత బుద్ధ భగవానుడు సంపూర్ణ జ్ఞానోదయం పొందిన పవిత్ర బుద్ధగయ క్షేత్రంలో ప్రతి సంవత్సరం సురేందర్ గారి జ్ఞాపకార్థం ఉచిత అన్నదాన కార్యక్రమాలతో పాటు, ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తూ ఆయన ఆశయాలకు నిజమైన వారసత్వాన్ని అందిస్తున్నారు." వీరులకు మరణం లేదు.. వారి పోరాటం రేపటి సూర్యోదయానికి నిరంతర ప్రేరణ" అంటూ అరె సురేందర్ గారికి విప్లవాంజలులు ఘటించారు.

# రాజమండ్రిలో కొత్త సెంటర్ ప్రారంభించిన ఒయాసిస్ ఫెర్టిలిటీ

## అధునాతన ఫెర్టిలిటీ సంరక్షణ ఇప్పుడు మరింత అందుబాటులోకి




రాజమండ్రి, **జూన్ 18 (ప్రజాకలం) :**

భారతదేశంలో విశ్వసనీయ ఫెర్టిలిటీ సంరక్షణ నెట్‌వర్క్‌లలో ఒకటైన, మరియు 16 సంవత్సరాలకు పైగా క్లినికల్ నైపుణ్యం కలిగిన ఒయాసిస్ ఫెర్టిలిటీ, రాజమండ్రిలో తన కొత్త, పూర్తి స్థాయి ఫెర్టిలిటీ సెంటర్ ను ప్రారంభించింది. ఈ నూతన కేంద్రం ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా, ఒయాసిస్ ఫెర్టిలిటీ, తన సుస్థిర ఉనికిని మరింత బలోపేతం చేసుకుంది. గత కొన్నేళ్లుగా ఒయాసిస్ ఫెర్టిలిటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా విస్తృతమైన కేంద్రాల నెట్‌వర్క్‌ను నిర్మించింది. దీంతో పట్టణ, ప్రాంతీయ ప్రాంతాలలోని జంటలు తమ సమీపంలోనే ప్రత్యేక ఫెర్టిలిటీ చికిత్స సేవలను పొందగలుగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ అంతటా సుస్థిరమైన, సైన్స్ ఆధారిత ఫెర్టిలిటీ సంరక్షణను అందించడంలో నిరంతర నిబద్ధతను, తాజాగా రాజమండ్రిలో రూపుదిద్దుకున్న ఒయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్ ప్రతిబింబిస్తుంది. సకాలంలో వైద్య పరీక్షలు మరియు తగిన వైద్య మార్గదర్శకత్వం ఫెర్టిలిటీ చికిత్సల ఫలితాలపై కీలక ప్రభావం చూపుతాయి. అనేక ప్రాంతాలలో చికిత్స అవసరమున్న జంటలకు, ఫెర్టిలిటీ సెంటర్లు దూరంగా ఉన్న కారణంగా సమస్య నిర్ధారణ మరియు చికిత్స అందించడంలో తరచుగా జాప్యం జరుగుతోంది. కొత్తగా ఏర్పాటైన రాజమండ్రిలోని ఒయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్ ఈ సమస్యను పరిష్కరించే విధంగా సంప్రదింపులు, రోగ నిర్ధారణలు, మరియు అధునాతన ఫెర్టిలిటీ చికిత్సలను ఒకే చోట అందిస్తోంది. దీంతో స్థానికంగా నివసించే జంటలు వారి ప్రాంతంలోనే సమగ్ర ఫెర్టిలిటీ సంరక్షణను పొందగలుగుతారు. ఈ సందర్భంగా ఒయాసిస్ ఫెర్టిలిటీ కో–ఫౌండర్ మరియు మెడికల్ డైరెక్టర్, డా. దుర్గా జి. రావు, మాట్లా డుతూ, "పదహారేళ్లకు పైగా, ఒయాసిస్ ఫెర్టిలిటీ సాక్ష్యాధారిత వైద్యం, ఎథికల్ క్లినికల్ ప్రోటోకాల్స్, వ్యక్తి గతీకరించిన చికిత్స మార్గాల ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని పెంచుకుంది. ముఖ్యంగా దంపతులను రెండు లేదా ముగ్గురు పిల్లలను కనాలని ప్రోత్సహిస్తున్న ఈ సమయంలో, సకాలంలో అవగాహన కల్పించడం, సరైన వైద్య మార్గదర్శకత్వం అందుబాటులో ఉండటం మరింత ప్రాముఖ్యత సంతరించుకుంది. రాజమండ్రిలో మా కేంద్రం ప్రారంభించడంతో, ఈ అనుభవాన్ని, సైన్స్–ఆధారిత విధానాన్ని ఈ ప్రాంతానికి కూడా విస్తరించి, ఇక్కడ నివసిస్తున్న జంటలకు సకాలంలో, తగిన ఫెర్టిలిటీ సంరక్షణ అందించడమే మా ముఖ్య ఉద్దేశ్యం" అని అన్నారు. ఈ ఆవిష్కరణ సందర్భంగా ఒయాసిస్ ఫెర్టిలిటీ సీఈఓ పుష్కరాజ్ షెనాయ్ మాట్లాడుతూ, "ఆంధ్రప్రదేశ్లో ఫెర్టిలిటీ రేట్లు క్రమంగా తగ్గుతున్నాయి. ముఖ్యంగా మారుమూల ప్రాంతాలలో సకాలంలో ఫెర్టిలిటీ పరీక్షలు పొందడం అనేది ఒక సవాలుగా మారిపోయింది. ప్రజలకు చేరువలోనే ఫెర్టిలిటీ సంరక్షణను అందుబాటులోకి తీసుకురావడం అత్యంత అవసరం. రాజమండ్రిలోని మా సెంటర్ ఈ ప్రాంతంలోని జంటలకు సాక్ష్యాధారిత ఫెర్టిలిటీ చికిత్సల సహాయంతో తల్లిదండ్రులయ్యే వీలు కల్పిస్తుంది, ఇన్ ది గుడ్ హ్యాండ్స్ ఆఫ్ సైన్స్", అని తెలిపారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ, రాజమండ్రి, కన్సల్టెంట్ ఒ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్, డా. గంగా ప్రియదర్శిని, మాట్లాడుతూ, "రాజమండ్రి, మరియు పరిసర ప్రాంతాల్లో నివసించే జంటలు తరచుగా ప్రత్యేక ఫెర్టిలిటీ పరీక్షలు, మరియు చికిత్సల కోసం పెద్ద నగరాలకు వెళ్లాల్సి వచ్చేది. ఈ సెంటర్ ప్రారంభంతో, వారు ఇప్పుడు ఇక్కడే అనుభవజ్ఞులైన నిపుణులు, సమగ్ర సౌకర్యాల మద్దతుతో ఒకే చోట సంప్రదింపులు, డయాగ్నస్టిక్స్, IUI, IVF, ICSI, PGT-A వంటి అధునాతన చికిత్సలను పొందవచ్చు" అని అన్నారు.

ఈ నూతన సెంటర్ ప్రారంభంతో, ఒయాసిస్ ఫెర్టిలిటీ ఆంధ్రప్రదేశ్లో తన ఉనికిని మరింతగా బలపరుచుకుంది. ఇటు నగరాలు, అటు అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు, రెండు చోట్లా జంటలకు అందుబాటులో సమగ్ర, సైన్స్ ఆధారిత ఫెర్టిలిటీ సంరక్షణను అందించడంలో సంస్థ తన నిబద్ధతను బలోపేతం చేసుకుంటోంది.

# సచివాలయం ముట్టడికి జర్నలిస్టుల యత్నం

## -అడ్డుకున్న పోలీసులు - గన్ పార్కు వద్ద అరెస్టులు

ప్రజాకలం/కుత్బుల్లాపూర్
హైదరాబాద్, జూన్ 18:

రాష్ట్ర ప్రభుత్వ వివక్ష, నిర్లక్ష్య వైఖరికి నిరసనగా, తమ డిమాండ్ల సాధనకై గురువారం జర్నలిస్టులు "ఛలో హైదరాబాద్"కార్యక్రమం నిర్వహించారు. గన్ పార్క్ నుంచి సచివాలయం ముట్టడికి బయలుదేరిన జర్నలిస్టులను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఇచ్చిన "ఛలో హైదరాబాద్" పిలుపు మేరకు రాష్ట్రవ్యా ప్తంగా పలు జిల్లాల నుంచి తరలివచ్చిన జర్నలిస్టుల గన్ పార్క్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ వ్యవస్థాపక,రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య గన్ పార్క్ లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద పూలు పెట్టి నివాళులర్పించారు.అనంతరం తెలంగాణ అమరవీరుల స్థూపానికి వినతిపత్రం సమర్పించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పన్నెండేళ్ళుగా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా పాలకులు వివక్ష చూపుతున్నారని విమర్శించారు. తెలంగాణ కోసం తెలంగాణ జర్నలిస్టులు అన్న నినాదంతో తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన జర్నలిస్టులను పాలకులు చిన్నచూపు చూడడం దుర్మార్గమని ధ్వజమెత్తారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ, జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం మొండి



చేయి చూపుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. తెలంగాణలో అనేక చిన్న, మధ్య తరహా పత్రికలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని, రెండున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం అడ్వర్టైజ్మెంట్స్ బిల్స్ ఇవడంలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్స్ వెంటనే ఇవ్వాలని, ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు అక్రెడిటేషన్ కార్డుతో పాటు హెల్త్ కార్డు ఇవ్వాలని, గ్రేటర్ హైదరాబాద్ తో సహా రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్లస్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ఎన్ఐ, పీఆర్జీఐ రిజిస్ట్రేషన్ తో రెగ్యులారిటీ ఉన్న పత్రికలను ఎంపానల్మెంట్ చేయాలని,జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు, కళాశాలల్లో ఉచిత విద్యను అందించాలని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రతి జర్నలిస్టుకు ఉచిత బీమా పథకం ఏర్పాటు చేయాలని, 60 సంవత్సరాలు దాటిన జర్నలిస్టులకు పెన్షన్లు ఇవ్వాలని, జర్నలిస్టుల సంక్షేమానికి బడ్జెట్ లో రూ.100 కోట్లు కేటాయించాలని, జర్నలిస్టుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన అనేక మంది జర్నలిస్టులు పాల్గొని ప్లకార్డులతో నినదించారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించగా పోలీసులు వారిని అడ్డుకొని అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని పంజాగుట్ట పోలీస్ స్టేషన్,ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ లకు తరలించారు. జర్నలిస్టుల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం నెరవేర్చకపోతే రాబోయే కాలంలో గత ప్రభుత్వాని పట్టిన గతే ఈ ప్రజా ప్రభుత్వానికీ పడుతుందని మామిడి సోమయ్య హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కో-కన్వీనర్లు బండి విజయ్ కుమార్, యాదగిరి, తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ చిర్రా శ్రీనివాస్, దామెర జగదీశ్వర్ గుప్తా, కే. పాండురంగారావు, పద్మనాభరావు, సామ్రాట్ గుప్తా, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి.రవికుమార్, కో-కన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్, సంతోష్ కుమార్, ఎం.రవికుమార్, సుభాష్, రేగటి వెంకన్న, ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నగేష్, మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు గండీటి నర్సింహా, కార్యదర్శి గోపాల్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మధు, సూర్యాపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్వాయి జానయ్య, ముషం హరిప్రసాద్, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జక్కుల విజయ్ కుమార్, స్వామిదాస్, పాలడుగు సురేందర్, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు దూమర్ల బాస్కర్, రంగారెడ్డి జిల్లా నాయకులు అశోక్ కుమార్ గౌడ్, పర్వతాలు, మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, గడ్డమీది అశోక్, జిల్లా నాయకులు సత్యనారాయణ, చిన్నబాబు, శ్రీనివాస్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గోవిందరావ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శివకుమార్, శివకుమార్ గౌడ్, దప్పు రామస్వామి, వాసాల బాలరాజు, శ్రీశైలం, నామమోహన్, దుర్గారావు, ప్రవీణ్, రమేష్, కొండల్ రెడ్డి, శ్యామ్ ముద్రాజ్, మంజులరెడ్డి, సుస్మిత, స్వప్న, సౌభాగ్యవతి తదితరులు పాల్గొన్నారు.

# అవినీతికి కరెంట్ కట్..

## -లంచం తీస్తూ చిక్కిన విద్యుత్ అధికారి..
## -రూ.25 వేల అవినీతి డీల్‌కు ఏసీబీ బ్రేక్..

సంగారెడ్డి, జూన్ 18 (ప్రజా కలం) ప్రతినిధి

ప్రజలకు సేవలు అందించాల్సిన ప్రభుత్వ అధికారి లంచం కోసం చేయిచాచడం సంగారెడ్డి జిల్లాలో సంచలనంగా మారింది. కరెంట్ స్తంభం పునర్నిర్మాణానికి సంబంధించిన పనిలో అనుమతులు, సాంకేతిక ప్రక్రియలను పూర్తి చేయడానికి లంచం డిమాండ్ చేసిన విద్యుత్ శాఖ అధికారి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారుల వలలో చిక్కాడు. ఈ ఘటన



జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారగా, ప్రభుత్వ కార్యాలయాల్లో కొనసాగుతున్న అవినీతిపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే, సంగారెడ్డి జిల్లా ఐడీఏ బొల్లారంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో సహాయ ఇంజనీర్‌గా పనిచేస్తున్న రామకృష్ణారెడ్డి, స్థానిక నివాసి మహమ్మద్ ఇఫ్రాజ్‌కు సంబంధించిన కరెంట్ స్తంభం పునర్నిర్మాణ పనుల విషయంలో రూ.25 వేల లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలిసింది. పలుమార్లు కార్యాలయం చుట్టూ తిరిగినా పని ముందుకు సాగకపోవడంతో పాటు లంచం ఇవ్వాలని ఒత్తిడి పెంచడంతో బాధితుడు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదును స్వీకరించిన ఏసీబీ అధికారులు ముందస్తు ప్రణాళిక ప్రకారం ఉచ్చుపన్ని, లంచం మొత్తాన్ని స్వీకరిస్తున్న సమయంలో రామకృష్ణారెడ్డిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి రూ.25 వేల నగదును స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సంబంధిత కార్యాలయంలో తనిఖీలు నిర్వహించి అవసరమైన పత్రాలను పరిశీలించారు. ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ సేవల కోసం ప్రజలు లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి దురదృష్టకరమని, అవినీతికి పాల్పడే అధికారులపై కఠిన చర్యలు తప్పవని అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఘటనతో విద్యుత్ శాఖలోని పని తీరుపై ప్రజల్లో చర్చ మొదలైంది. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత పెరగాలని, అవినీతి రహిత సేవలు అందించాలని స్థానికులు కోరుతున్నారు..

# ప్రజా సంక్షేమ అభివృద్ధే నా లక్ష్యం

## - ఎల్‌బీ నగర్‌తో ప్రత్యేక అనుబంధం
## - కష్టకాలంలో అండగా నిలిచిన ప్రజలకు రుణపడి ఉంటా
## - కాంగ్రెస్ కార్యకర్తల పోరాటంతోనే ప్రజా పాలన సాధ్యమైంది
## - గుర్రంగూడ వనమహోత్సవంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

రంగారెడ్డి జిల్లా , జూన్ 18, (ప్రజా కలం)

ఎల్‌బీ నగర్ అసెంబ్లీ నియోజకవర్గంతో తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తన రాజకీయ జీవితంలోని క్లిష్ట పరిస్థితుల్లో ఎల్‌బీ నగర్ ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు అందించిన మద్దతును ఎప్పటికీ మరువలేనని పేర్కొన్నారు. గుర్రంగూడలో వనమహోత్సవ కార్యక్రమం సందర్భంగా సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. 2018 శాసనసభ ఎన్నికల్లో రాజకీయ కుట్రల కారణంగా కొడంగల్‌లో ఓటమి పాలైన సమయంలో తన రాజకీయ భవిష్యత్తుపై చాలామంది సందేహాలు వ్యక్తం చేశారని సీఎం గుర్తు చేసుకున్నారు. అయితే కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ తనపై నమ్మకం ఉంచి మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసే అవకాశం కల్పించారని చెప్పారు.ఆ ఎన్నికల్లో ఎల్‌బీ నగర్ నియోజకవర్గ ప్రజలు దాదాపు 30 వేల మెజార్టీ ఇచ్చి తనను గెలిపించడమే కాకుండా, ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుకు బలం చేకూర్చారని తెలిపారు. పార్లమెంటులో ప్రజా సమస్యలపై గట్టిగా పోరాడిన తన సేవలను గుర్తించిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ తనకు పీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారని వివరించారు.పీసీసీ చీఫ్‌గా మూడేళ్ల పాటు నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడి, లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రంలో ప్రజా పాలనను ఏర్పాటు చేయగలిగామని సీఎం అన్నారు.

పదవుల కోసం పార్టీని వదిలివెళ్లారు.

ఈ సందర్భంగా గతంలో ఎల్‌బీ నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు విజయం సాధించిన ప్రజా ప్రతినిధులు పదవుల కోసం పార్టీని, కార్యకర్తలను వదిలి వెళ్లిపోయారని పరోక్షంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. అయితే కాంగ్రెస్ కార్యకర్తలు మాత్రం పార్టీ జెండాను వదలకుండా కష్టకాలంలో అండగా నిలిచారని కొనియాడారు.నల్గొండ, రంగారెడ్డి,



మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన ప్రజలు అధికంగా నివసిస్తున్న ఎల్‌బీ నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. "నాకు అండగా నిలిచిన ఎల్‌బీ నగర్ ప్రజల రుణం తీర్చుకునేలా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తాం" అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మన అందరి సామాజిక బాధ్యత

## -మల్కారం గ్రామంలో ఘనంగా వన మహోత్సవం
## -మొక్కలు నాటిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

శంషాబాద్, జూన్ 18,(ప్రజా కలం)

పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మన అందరి సామాజిక బాధ్యత అని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం, శంషాబాద్



మండలం పరిధిలోని మల్కారం గ్రామంలో ఈరోజు 'వన మహోత్సవం' కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గౌరవ ఎమ్మెల్యే శ్రీ టి. ప్రకాష్ గౌడ్ గారు ముఖ్య అతిథిగా విచ్చేసి, స్వయంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పచ్చదనం పెంపొందించడం, పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మన అందరి సామాజిక బాధ్యత అని గుర్తుచేశారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటడమే కాకుండా, వాటిని కంటికి రెప్పలా సంరక్షించాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు మరియు మల్కారం గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

## పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేసిన రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

శంషాబాద్, జూన్ 18,(ప్రజా కలం)

శంషాబాద్ మండలంలోని మాజీ సర్పంచ్ రాచమల్ల సిద్దేశ్వర్ నిర్వహిస్తున్నటువంటి రాచమల్ల చెన్నమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారి కుటుంబీకులు అందరూ కలిసి ఈరోజు శంషాబాద్ మండలం మరియు మున్సిపాలిటీలోని వివిధ గ్రామాలలో ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలో 2025-26 సంవత్సరానికి గాను పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించినటువంటి విద్యార్థినీ విద్యార్థులకు ఈరోజు నగదు పారితోషికంతో పాటు వారిని సన్మానించి బహుమతులను ప్రధానం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు టి ప్రకాష్ గౌడ్ పాల్గొని వారి చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేసి వారిని ప్రోత్సహించడం జరిగింది . అనంతరం ఎమ్మెల్యే గారు మాట్లాడుతు భవిష్యత్తులో మీరందరూ మంచి చదువులు చదువుకుని ఇలాంటి ప్రోత్సాహకాలు అందిస్తున్నటువంటి వారిని గౌరవించి ఉన్నత పదవులు ఆశించాలని కోరుకుంటున్నానని విద్యార్థిని విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు తెలపడం జరిగింది.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275**, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com